PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 84 | విజయవాడ, శనివారం 25 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 25 October 2025 | Rs

టీమిండియాకు నాల్గో స్థానమే

- నేడు ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా జట్ల మధ్య కీలక పోరు
- గెలిచిన జట్టుతో సెమీస్‌లో తలపడనున్న హర్మన్‌ప్రీత్ సేన


8



పూర్తిగా దగ్ధమైన బస్సు

డెత్ జర్నీ

- కర్నూలు జిల్లాలో దగ్ధమైన ప్రైవేట్ స్లీపర్
- 19 మంది సజీవ దహనం..
- బస్సు ఢీకొన్న బైకర్ మృతి
- రాష్ట్రపతి, ప్రధాని, సిఎం తదితరుల దిగ్భ్రాంతి



మంటల్లో దగ్ధమౌతున్న బస్సు, ప్రమాదం నుంచి బయటపడి రోదిస్తున్న ప్రయాణికుడు

మాంసపు ముద్దలుగా మారిన మృతదేహాలు



హాయిగా నిద్రపోయి ఉదయాన్నే ఉద్యోగాలకు, ఇతర పనులకు వెళ్లవచ్చు అనుకుంటూ ఆ స్లీపర్ బస్సు ఎక్కిన వారికి ఆ క్షణంలో తెలియదు అదే తమ చివరి ప్రయాణమని! ఎక్కవలసిన స్టేజిలో మిస్ అయిన వారు హడావిడిగా తరువాత స్టేజ్‌లో వచ్చి మరీ ఎక్కారు. కొందరైతే ఆటోలలో, క్యాబ్‌లలో ఛేజ్ చేసి మరీ ఎక్కారు! ఏదో ఒక విధంగా బస్సు ఎక్కితే హాయిగా పడుకోవచ్చు... ఉదయం పనులు అంతే హ్యాపీగా చేసుకోవచ్చన్నది వీరి ఆశ! కానీ, జరిగింది వేరు! అనూహ్యంగా జరిగిన ప్రమాదం బస్సును నిలువునా దగ్ధం చేసింది. నిబంధనలు ఏమాత్రం పాటించని, భద్రతా ప్రమాణాలను అణుమాత్రం కూడా పట్టించుకోని ప్రైవేటు నిర్వాకం ఆ ప్రయాణాన్ని డెత్ జర్నీగా మార్చింది.

మంటల ధాటికి నిమిషాల్లోనే కాలిబుగ్గై ఇనుప అస్థిపంజరంగా మారిన బస్సులో కొందరు ప్రాణాలు దక్కించుకున్నా మృత్యు రక్కసిని అతి సమీపం నుండి చూశారు! తెల్లవారుజామున కళ్లముందు ఆవిష్కృతమైన భయానక దృశ్యాలు వారిని జీవితకాలం వెంటాడుతూనే ఉంటాయి. మరికొందరు మాంసపు ముద్దలుగా మిగిలారు! బతికి బయటపడిన వారు ప్రమాదంలో చిక్కుకున్న తమ సన్నిహితుల కోసం చేస్తున్న రోదనలు, ఏడుపులతో ఆ ప్రాంతం మార్మ్రోగింది. శుక్రవారం తెల్లవారు జామున కర్నూలు జిల్లాలో జరిగిన ఈ ఘోర ప్రమాదంలో 19మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. బస్సు ఢీకొన్న ఒక బైకర్ మృతి చెందారు. ఈ ఘోర దుర్ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కర్నూలు హాస్పిటల్

హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు ఎసి స్లీపర్ బస్సు శుక్రవారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతి కావడంతో 19 మంది బస్సులోనే సజీవ దహనమయ్యారు. మిగిలిన వారు అతికష్టం మీద బస్సు అద్దాలను పగలకొట్టుకుని ప్రాణాలతో బయటపడ్డారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్న టేకూరు దాటిన తర్వాత తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఓ ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయిన బస్సు దాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ద్విచక్రవాహనం బస్సుకిందకు దూసుకుపోయి ఇరుక్కుపోగా, దాని నుండి చెలరేగిన మంటలు బస్సుకు అంటుకున్నాయి. ఇంత జరిగినా బస్సు ఆగకపోవడం, విపరీతమైన వేగంతో ముందుకు దూసుకుపోవడంతో శర వేగంగా వ్యాపించిన మంటలు క్షణాల్లోనే బస్సును భస్మీపటలం చేశాయి. వెనుకవైపు ఎమర్జన్సీడోర్‌లు తెరుచుకోకపోవడం, పగలకొట్టడానికి వీలేలేనంత గట్టిగా బస్సు అద్దాలు ఉండటం, పగలకొట్టడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో పాటు, ముందువైపు తలుపు కూడా తెరుచుకోకపో వడంతో మృతుల సంఖ్య భారీగా పెరిగింది. అతికష్టం మీద అద్దాలు పగలకొట్టుకుని కొందరు బయటకు రాగలిగారు. బస్సులో నుంచి బయటకు రాలేని 19 మంది బస్సులోనే సజీవ దహనం అయ్యారు. మృతదేహాలు మాంసపు ముద్దలుగా మారి గుర్తుపట్టలేనట్లుగా కాలిపోయాయి. ద్విచక్ర వాహనంపై కర్నూలు నుంచి డోన్ వైపు వెళు_న్న కర్నూలు ప్రజానగర్‌కు చెందిన శివశంకర్ (21) ఎగిరి రోడ్డు పక్కన పడి అక్కడిక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనం ప్రయివేటు బస్సు కిందకు వచ్చి ఇరుక్కుంది. 300 మీటర్లు మిగతా 3లో

మరిన్ని వార్తలు లోపలి పేజీల్లో

మృత్యు శకటాలు

- ప్రాణాలు తీస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్
- ఎక్కడో రిజిస్ట్రేషన్... ఇక్కడ రోడ్లపైకి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి, అమరావతి బ్యూరో

ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ప్రయాణికుల ప్రాణాలను పొట్టని పెట్టుకుంటున్నాయి. ప్రయాణికుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు తప్ప మిగిలిన సమయాల్లో చూసీ,చూడనట్లు అధికారయంత్రాంగం వ్యవహరించడం కూడా దీనికి కారణం. తెలుగు రాష్ట్రాల్లో రోడ్లమీద తిరిగే ప్రైవేటు బస్సుల్లో అత్యధికభాగం ఎక్కడో రిజిస్టర్ అయినవి కారణం. తాజాగా ప్రమాదానికి గురైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు కూడా కేంద్రపాలిత ప్రాంతమైన డయ్యుడామన్‌లో రిజిస్ట్రేషన్ చేయించారు. ఒడిషాలో ఫిట్‌నెస్ చేయించినట్లు చెబుతున్నారు. తాము బస్సులు నడుపుతున్న రాష్ట్రాల్లో అధికంగా ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజు, రోడ్‌ట్యాక్స్ ఎగ్గొట్టడానికి కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇలా ఆల్ ఇండియా పర్మిట్లను ప్రైవేటు ఆపరేటర్లు తీసుకుంటున్నారు. పదుల సంఖ్యలో బసులు నడిపే వారికి దీనివల్ల ప్రతి ఏడాది పెద్దమొత్తంలో మిగులుతోంది. ఇతర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ కావడంతో స్థానిక అధికారులు తనిఖీలపై పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదంటున్నారు. దీనిని అధిగమించడానికి తమిళనాడు ప్రభుత్వం ప్రాంతీయ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి మిగతా 7లో



సంఘటనా స్థలంలో కాలిపోయిన బస్సును పరిశీలిస్తున హోంమంత్రి వంగలపూడి అనిత తదితరులు

'హైడ్రో'కు వ్యతిరేకంగా అరణ్య గర్జన ర్యాలీ

- అల్లూరి జిల్లా కలెక్టరేట్ ముట్టడి
- ప్రాజెక్టు వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లిన పాడేరు



ర్యాలీ అగ్ర భాగంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు (అల్లూరి జిల్లా)

హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యాన అల్లూరి జిల్లాలోని పాడేరులో అరణ్య గర్జన ర్యాలీ నిర్వహించారు. హైడ్రో వ్యతిరేక నినాదాలతో పాడేరు దద్దరిల్లింది. తొలుత పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది గిరిజనులు, నాయకులు పాల్గొన్నారు. ర్యాలీగా తరలివచ్చిన గిరిజనులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ అధ్యక్షత జరిగిన ముట్టడి సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ...కార్పొరేట్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అక్రమ హైడ్రో ఒప్పందాలు, జిఒ 51, 13, 02ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జిఒలు అనంతగిరి మండలంలోని గుజ్జిలి, పెదకోట, చిట్టంవల్లలో, జికెవీధి మండలం సీలేరు, ఎర్రవరంలో 7400 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల 20 వేల ఎకరాల అటవీ భూమి ధ్వంసం అవుతుందని, 50 వేల మంది గిరిజనులు, 250 గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామసభల ఆమోదం లేకుండా అదాని, నవయుగ, మెగా, శిరిడి సాయి వంటి కార్పొరేట్‌లకు 20 వేల ఎకరాల అటవీ భూములు కేటాయించడం చట్టవిరుద్ధం, అన్యాయం అన్నారు. ఆదివాసీల నిజమైన అభివృద్ధికి ఆ ప్రాంతంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులను గిరిజన యువతతోనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌బిఐ పోతురాజు, వి.ఉమామహేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాగిన ధర్మానపడాల్, హైడ్రోపవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ నాయకులు మజ్జి సురేష్‌కుమార్, కొర్ర స్వామి, భూరిడి దశరథు, అరకువ్యాలీ వైస్ ఎంపిపి రామన్న, సుంకరమతం సర్పంచ్ గెమ్మిలి చిన్నబాబు, మాజీ సర్పంచ్ కొండలరావు, భూర్జ ఎంపిటిసి సభ్యులు హరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభ ఆమోదంతోనే పనులు: కలెక్టర్

గ్రామసభ ఆమోదం లేకుండా హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు ముందుకు సాగవని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ గిరిజనుల ఎదుట స్పష్టం చేశారు. కలెక్టరేట్ ముట్టడించిన హైడ్రో నిర్వాసిత గ్రామాల గిరిజనులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. తనకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్న అన్ని డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. ఈ నెల 27న కలెక్టరేట్‌లో కేవలం నిపుణుల కమిటీతో మాత్రమే సమావేశమని, ఇది ప్రజాభిప్రాయ సేకరణ కోసం నిర్వహించలేదన్నారు.

యుఎఇ, ఎపిల మధ్య సరికొత్త వాణిజ్య బంధం

- రాష్ట్రంలో అవకాశాలు పరిశీలించాలని సిఎం ఆహ్వానం
- చివరి రోజు పర్యటనలో పలు సంస్థల ప్రతినిధులతో భేటీ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బృందం యుఎఇ పర్యటనలో భాగంగా చివరి రోజు ఆ దేశ మంత్రులు, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తొలుత యుఎఇ ఆర్థిక వ్యవహారాలు, పర్యాటకశాఖ మంత్రి అబ్దుల్లా బిఎన్ తౌక్ అల్ మర్రీతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. యుఎఇ, ఆంధ్రప్రదేశ్ మధ్య వాణిజ్య బంధాన్ని పెంపొందించే అంశంపైనా, రవాణా, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడుల గురించి ఇరువురు నేతలు చర్చించారు. భారత్, యుఎఇ దేశాలు నాలెడ్జ్ ఎకనామీపై ప్రస్తుతం దృష్టి పెట్టినట్లుగానే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాలన, పౌర సేవలను మరింత మెరుగ్గా అందించే అంశంపై రాష్ట్రానికి సహకారం అందించాలని సిఎం కోరారు. సాంకేతికంగా పౌరసేవలు, పాలనా అంశాల్లోని అత్యుత్తమ విధానాలను ఆర్‌టిజిఎస్‌తో ఇచ్చిపుచ్చుకునే అంశంపై ఇరువురు నేతలు అవగాహనకు వచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ – దుబాయ్ సిలికాన్ ఒయాసియా మధ్య కొత్త భాగస్వామ్యాలను ఏర్పాటు చేసే అంశంపై రెండు ప్రభుత్వాలు ఒక అంగీకారానికి వచ్చాయి. ముఖ్యంగా ఆహార భద్రతకు సంబంధించి రాష్ట్రంతో కలిసి పని చేసేందుకు యుఎఇ ఆర్థిక వ్యవహారాల మంత్రి ఆసక్తి కనబరిచారు. విదేశీ వాణిజ్య శాఖ మంత్రి థానీ బిన్ అహ్మద్ జియౌదితోనూ ముఖ్యమంత్రి బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సహకారం అంశాలపై చర్చ జరిగింది. థానీ బిన్ అహ్మద్ భారతదేశం – యుఎఇల మధ్య మిగతా 7లో

బంగాళాఖాతంలో నేడు వాయుగుండం

- 3 రోజులు భారీ వర్షాలు
- సమీక్షించిన హోంమంత్రి అనిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ శనివారం వాయుగుండంగా మారనుందని విపత్తుల నిర్వహణశాఖ తెలిపింది. ఆదివారం తీవ్ర వాయుగుండంగా మారి సోమవారం తుపాను గా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్, ఇడి దీపక్, అధికారులతో హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తుపాను తీవ్రతను అంచనా వేసి ప్రభావిత జిల్లాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల న్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాలకు ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను పంపించాలని ఆదేశించారు. ప్రజలు సోషల్ మీడియాలోని వదంతులను నమ్మకుండా విపత్తుల నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101ను మిగతా 7లో

సర్వీస్ ఇనామ్ భూములపై అధ్యయనానికి కమిటీ

- భూ కేటాయింపులపై సమగ్ర విధానం
- జూన్ నాటికి టిడ్కో ఇళ్లు : మంత్రులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సర్వీస్ ఇనామ్ భూముల సమస్యలపై అధ్యయనానికి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి. నారాయణ, కొలుసు పార్థసారధి తెలిపారు. సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలపై అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ భేటీ జరిగింది. ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన వారుదేవాదాయశాఖ అధికారులు, తహాశీల్దార్లతో కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి 45 రోజుల్లో నివేదిక ఇస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. పరిశ్రమలు, ఇతర అవసరాలకు భూముల కేటాయింపుపై ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ఈ విధానంపై చర్చించి త్వరలోనే విధానాన్ని ప్రకటిస్తామన్నారు. ఫ్రీహోల్డ్ భూముల సమస్యపై కూడా చర్చించామని, ఆ భూముల విధానాన్ని మరింత సరళతరం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించినట్లు ఆయన తెలిపారు. వక్ఫ్ భూములపై కూడా సమగ్రంగా చర్చించినట్లు మంత్రి వెల్లడించారుమునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ 2.60లక్షల ఇళ్లను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని సిఎం ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసుపార్ధసారధి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు,ఇళ్ల స్థలాలు ఇవ్వాలనినిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ రెండు, మూడు సెంట్లు స్థలాలు ఎలా ఇవ్వాలో ఈ సమావేశంలో చర్చించినట్లు ఆయన తెలిపారు. కొన్ని లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరగనిచోట లబ్ధిదారులను ఒప్పించి వారికి రెండు,మూడు సెంట్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం సెంటున్నర స్థలాలను నివాస యోగ్యం కాని ,నిర్మాణాలకు అనువుగా లేనిప్రాంతాల్లో ఇచ్చి ప్రజలకు గుదిబండగా మార్చిందన్నారు.



రూ. 500కే ఎల్‌పిజి సిలిండర్

- తేజస్వి యాదవ్ హామీ

పోలీసుల లైంగిక వేధింపులతో వైద్యురాలి ఆత్మహత్య!

- ఇద్దరు అధికారుల సస్పెన్షన్

7

'బల్క్‌డ్రగ్' వద్దు

- కలెక్టర్ సమావేశంలో స్పష్టంచేసిన మత్స్యకారులు

2

పెరుగుతున్న అసమానతలు

- 'ఉదారవాదానికి ఆవల' చర్చాగోష్టిలో ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్
- సంక్షోభం నుండి సంక్షోభంలోకి ప్రయాణం
- మార్క్సిజమే సమాజానికి రక్ష



మాట్లాడుతున్న ప్రభాత్ పట్నాయక్, వేదికపై అంజయ్య, బుడ్డిగ జమిందార్, కాపు శ్రీనివాస్, పి.మురళీకృష్ణ, ప్రొఫెసర్ అంజిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల గత 40 ఏళ్లలో ఉత్పాదకత పెరిగినా ఉపాధి పెరగడం లేదని, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, నియంతృత్వ పోకడలతో కూడిన ఫాసిస్టు ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వస్తున్నాయని ప్రముఖ ఆర్థికవేత్త, జెఎన్‌యు ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ అన్నారు. ఉదారవాదానికి ఆవల అనే అంశంపై శుక్రవారం సాయంత్రం సోషల్ సైన్సెస్ ట్రస్ట్, ప్రొగ్రెసివ్ ఫోరం, ఎంబి విజ్ఞాన కేంద్రం, మన మంచి పుస్తకం సంస్థల ఆధ్వర్యాన ఎంబి విజ్ఞాన కేంద్రంలోజరిగిన చర్చాగోష్టిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 40 ఏళ్లలో అన్ని దేశాల్లోనూ ఆర్థిక వృద్ధి పెరిగిందని, అది ఉపాధిగా మారడం లేదని అన్నారు.ఫలితంగా ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. అదే సమయంలో పెట్టుబడిదారీదేశాల్లో నియంతృత్వ పోకడలతో కూడిన ఫాసిస్టు ప్రభుత్వాలు అధికారంలోకి వస్తున్నాయని తెలిపారు. నయా ఉదారవాద తెచ్చిన అతిపెద్ద ప్రమాదం నియంతృత్వ ప్రభుత్వాలను అధికారంలోకి తీసుకురావడమేనని అన్నారు. ఆర్థిక అసమానతలు, ఉపాధిలేమి, పెట్టుబడి పోగుబడటం వంటి కారణాలతో ఆ వ్యవస్థ అంతా ఒక సంక్షోభం నుండి బయటపడేలోపే మరో సంక్షోభంలోకి పోతోందని వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు ప్రజల సంక్షేమానికి బాధ్యత వహించడం ద్వారానే పెట్టుబడిదారీ వ్యవస్థను ఎదుర్కోగలమని ఆయన వివరించారు. మన దేశంలో పెట్టుబడి కొద్దిమంది చేతుల్లో పోగవుతోందని అన్నారు. వారిపై రెండుశాతం పన్ను విధించినా, లేదా వారు చనిపోయిన తరువాత మూడోవంతు వారి ఆస్తిని ప్రభుత్వాలు సేకరించినా దేశంలో అందరికీ విద్య, ఉపాధి, వైద్యం కల్పించవచ్చని అన్నారు. మనదేశంలో ఈవిషయాన్ని సైద్ధాంతికంగా అర్థం చేసుకుని ప్రజలకు వివరించడం ద్వారా వారిని చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అసమానతలతో నిండిపోతున్న సమాజానికి మార్క్సిజం మాత్రమే రక్షణ ఇవ్వగలదని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు అవగాహన మిగతా 7లో

చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - బత్తలపల్లి


శ్రీశైలం నాగరాజు (ఫైల్‌ఫొటో)

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొట్లమర్రి గ్రామానికి చెందిన శ్రీశైలం నాగరాజు (38) మగ్గం నేసుకుంటూ, చిల్లర దుకాణం నడుపుతున్నారు. కుటుంబ అవసరాలకు దాదాపు రూ. ఎనిమిది లక్షలు అప్పులు చేశారు. మగ్గం ద్వారా వచ్చే ఆదాయంతో అప్పులు తీరే దారిలేకపోవడంతో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వర్షం కురుస్తుండడంతో నాగరాజు తన భార్య, ఇద్దరు కుమారులను అదే గ్రామంలో ఉంటున్న అత్తగారి ఇంటికి పంపారు. శుక్రవారం తెల్లవారుజామున కుమారులు వచ్చి చూడగా మగ్గం దూలానికి చీరతో ఉరివేసుకొని నాగరాజు విగతజీవిగా ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్ల్యుటిఎం సమావేశానికి మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లండన్‌లో నవంబర్ 4 నుంచి 6వ తేది వరకు జరిగే వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యుటిఎం)-2025 సమావేశానికి పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ పాల్గొనున్నారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. మంత్రితో పాటు ఈ పర్యటనలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పాల్గొంటారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కటారి దంపతుల హత్య కేసులో ఐదుగురిపై నేర నిరూపణ

- 27న శిక్ష ఖరారు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

2015 నవంబర్ 17న చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నాటి నగర మేయర్ కటారి అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ జంటహత్య కేసులో ఐదుగురిపై నేర నిరూపణ రుజువైంది. వీరికి ఈ నెల 27న శిక్ష ఖరారు చేయనున్నట్లు తొమ్మిదో అదనపు న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. తీర్పు నేపథ్యంలో జిల్లా కోర్టులో భారీ పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. కేసులోని చంద్రశేఖర్ (చింటూ), వెంకటాచలపతి, విజయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్‌ను దోషులుగా నిర్ధారించారు. మిగతా 23 మందిపై కేసును కొట్టివేశారు. తీర్పు అనంతరం ఐదుగురు దోషులను చిత్తూరు జైలుకు తరలించారు.


సురక్షితంగా బయటపడ్డ విద్యార్థులు విష్ణు, మునిరత్నం, కృష్ణ

స్వర్ణముఖి నదిలో విషాదం

- ఈతకెళ్లి విద్యార్థి మృతి
- ముగ్గురు గల్లంతు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

స్వర్ణముఖి నది వాగులోకి విద్యార్థులు సరదాగా ఈతకెళ్లిన ఘటన విషాదాన్ని నింపింది. ఒకరు మృతి చెందారు. ముగ్గురు గల్లంతయ్యారు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేదాంతపురం అగ్రహారంకు చెందిన బాలు (16), ప్రకాష్, చిన్న, తేజ, బాలు, విష్ణు, మునిరత్నం, కష్ణ శుక్రవారం సాయంత్రం సువర్ణముఖి నదిలోకి ఈత కొట్టేందుకు వెళ్లారు. నది ఉధతి తీవ్రంగా ఉండడంతో ఏడుగురు విద్యార్థులు అందులో ఇరుక్కున్నారు. వారిలో విష్ణు, మునిరత్నం, కష్ణ ఎలాగోలా చెట్ల వేర్లు పట్టుకొని బయటపడ్డారు. ప్రకాష్, చిన్న, తేజ, బాలు వరద ఉధృతికి కొట్టుకుపోయారు.

దీంతో భయాందోళనకు గురైన బయటపడిన విద్యార్థులు స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని కొట్టుకుపోయిన విద్యార్థుల కోసం గజ ఈతగాళ్లతో వెతుకులాట ప్రారంభించారు. కొట్టుకుపోయినవారిలో ఓ విద్యార్థి బాలు మృతదేహం బయటపడింది. మరో ముగ్గురి కోసం నీటిలో వెతుకులాట కొనసాగుతోంది. చీకటి పడడంతో వెతుకులాటకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులందరూ 15 నుంచి 20 సంవత్సరాల లోపు వారే.

‘బల్క్‌డ్రగ్’ వద్దు

- కలెక్టర్ సమావేశంలో స్పష్టంచేసిన మత్స్యకారులు
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : కలెక్టర్ విజయకృష్ణన్


సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని రాజయ్యపేటలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుపై మత్స్యకారులతో శుక్రవారం చర్చలు జరిపారు. మత్స్యకారులందరూ ఒకటే మాటగా బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయొద్దని కలెక్టర్‌కు విన్నవించారు. బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు 41 రోజుల నుండి శాంతియుతంగా రిలే దీక్షలు చేస్తున్నారు. గతంలో వారికిచ్చిన హామీ మేరకు మత్స్యకారులతో కలెక్టర్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా జరుగుతున్న నష్టాన్ని, ఆ కంపెనీ ఏర్పాటుకు ముందు, తరువాత ఉన్న పరిస్థితులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కంపెనీ వ్యర్థ రసాయన జలాలు సముద్రంలో వదలడం వల్ల మత్స్య సంపద నశించి పోవడంతో ఉపాధి కోల్పోయామన్నారు. ఆ కంపెనీ కాలుష్యం కారణంగా కేన్సర్, కిడ్నీ తదితర వ్యాధులతో 58 మంది చనిపోయారని, ఇంకా వందల సంఖ్యలో గ్రామస్తులు అనారోగ్యంతో బాధపడుతున్నారని వివరించారు. కంపెనీలు ఏర్పాటు చేస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారని, హెటిరో కంపెనీలో స్థానికులు 75 మంది కూడా లేరన్నారు. ఇప్పుడు బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుచేస్తే తమ ఉనికికి, ఉపాధికి ప్రమాదం వాటిళ్లుతుందని, తమ జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేస్తున్నది బల్క్ డ్రగ్ కంపెనీ కాదని, బల్క్ డ్రగ్ పార్క్ అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఎపిలో బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఆగస్టు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలోని అభిప్రాయాలను వీడియో, రాతపూర్వకంగా కేంద్ర ప్రభుత్వానికి నివేదించామన్నారు.

ప్రస్తుతానికి మౌలిక వసతుల కల్పనలో భాగంగా రోడ్లు, ఎలక్ట్రిసిటీ, తాగునీటికి సంబంధించిన పనులు జరుగుతున్నాయని తెలిపారు. బల్క్ డ్రగ్ పార్క్‌ను పూర్తిగా ప్రభుత్వం నిర్వహిస్తుందని, కాలుష్య నియంత్రణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత కమిటీ వేశారని వివరించారు. కమిటీ సభ్యులు సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. అప్పటివరకు పనులు నిలుపుదల చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేయడంతో, ఇది తన స్థాయిలో లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ బదులిచ్చారు. బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు.

సిపిఎం నేత అప్పలరాజు గృహ నిర్బంధం

అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ రాజయ్యపేట పర్యటన సందర్భంగా సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులకు న్యాయం చేయకుండా ఉక్కుపాదం మోపుతోందన్నారు. మత్స్యకారులు జీవన పోరాటానికి తాము అండగా ఉంటామని స్పష్టంచేశారు.

ఇక తిరుపతి ‘గ్రేటర్’

- కార్పొరేషన్ కౌన్సిల్ ఆమోదం
- అజెండాపై కార్పొరేటర్ల మాటల యుద్ధం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశం గ్రేటర్ అంశంపై రసాభసగా మారింది. వైసిపి, కూటమి కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం నడిచింది. తిరుపతిని గ్రేటర్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించడంతో అధికారులు కౌన్సిల్ అజెండాలో పొందుపరిచారు. ఇందులో తిరుపతి రూరల్‌తో పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట, ఏర్పేడు, చంద్రగిరి మండలాల్లోని కొన్ని పంచాయతీలను గ్రేటర్‌లో కలుపుతూ అజెండాను రూపొందించారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్లో వందో అంశంగా గ్రేటర్ తిరుపతిని పెట్టారు. చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎంఎల్‌ఎలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి కొన్ని అభ్యంతరాలు తెలిపారు. గ్రేటర్ అంశంపై కూటమి ప్రభుత్వంలో ఉండే కార్పొరేటర్లు ప్రస్తావించకూడదని ముందుగానే సంకేతాలు అందాయి. మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన శుక్రవారం ఎస్‌వి సెనెట్ హాల్లో కౌన్సిల్ సమావేశం జరిగింది. తిరుపతి ఎంపి గురుమూర్తితో పాటు ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తిరుపతిని గ్రేటర్ చేయాలని, కౌన్సిల్లో ఉండే అందరూ ఆమోదించాలని సూచించారు. అయితే తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు మాత్రం గ్రేటర్ తిరుపతికి తాము అనుకూలమేనని, అయితే చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎంఎల్‌ఎల ప్రతిపాదనల్లో మరికొన్ని గ్రామాలు చేర్చాలని సూచించారని, ఈ అంశాన్ని తరువాత చర్చించి 15 రోజుల్లో గ్రేటర్‌పై కౌన్సిల్లో తీర్మానం చేయాలని అన్నారు. దీనికి వైసిపి కార్పొరేటర్లు ఒప్పుకోలేదు. ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఒక దశలో వైసిపి, కూటమి కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం నడిచింది. పోడియం వద్దకు వెళ్లి వైసిపి కార్పొరేటర్లు ప్లకార్డులతో తిరుపతిని గ్రేటర్ చేయాలని పట్టుబట్టారు. కౌన్సిల్లో వైసిపికి మెజార్టీ ఉండడంతో తిరుపతి గ్రేటర్ ఓకే అయ్యింది. దీంతో కూటమి కార్పొరేటర్లు అంగీకరించాల్సి వచ్చింది. అజెండాలో 108 అంశాలు పొందుపరచగా 107 అంశాలకు ఆమోదం తెలిపారు. ఒక అంశం వాయిదా పడింది.

పశు సంవర్ధకశాఖలో పోస్టులు భర్తీ చేయండి

- డైరెక్టర్‌కు డివైఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతు సేవా కేంద్రాల్లో క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, పశు సంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ (ఎహెచ్‌ఎ) పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ టి దామోదర్ నాయుడును ఆ సంఘం కార్యదర్శి జి రామన్న శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పశు సంపదలో దేశంలోనే రాష్ట్రం ముందంజలో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం, పశు సంవర్ధకశాఖ చేస్తున్న కృషి ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఈ కృషిని మరింత ముందుకు తీసుకుపోవాలంటే ఎహెచ్‌ఎ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డెయిరీ సైన్స్, వెటర్నరీ డిప్లమో కోర్సులను పూర్తి చేసిన నిరుద్యోగులు 50 వేల మంది ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నమ్మి నోటిఫికేషన్ వస్తుందని శిక్షణ కేంద్రాలకు వేలకు వేలు ఫీజుల రూపంలో ఖర్చు చేస్తున్నారని వివరించారు. ఇప్పటికే నిరుద్యోగులు ఆర్థికంగా చితికిపోయారని పేర్కొన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ వల్ల నిరుద్యోగులకు ఉపాధి దొరకడంతో పాటు పశు సంపద అభివృద్ధి ద్వారా రైతులకు న్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ నాయకులు శివ, బసవ, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో భారీ వర్షం

- లోతట్టు కాలనీలు మునక
- ఉమ్మడి తూర్పులో 31 వేల ఎకరాల్లో పంటనష్టం
- ప్రకాశంలో నీట మునిగిన మిర్చి, పత్తి, మినుము

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అనంతపురం, ఉమ్మడి తూర్పుగోదావరిలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో 94.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రంలోని విశ్వశాంతి నగర్, గుల్జార్‌పేట, కోవూరు నగర్, లక్ష్మీనగర్, నడిమివంక పరివాహక ప్రాంతాలు, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ, వడ్డే కాలనీ, కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు, ఆలమూరు రోడ్డు పరిసర ప్రాంతాల ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలో చిక్కుకున్న వారికి సమీప సచివాలయాల్లో తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. సత్యసాయి జిల్లా ముదిగుబ్బలో గురువారం రాత్రి ఓ ఇల్లు కూలిపోయింది. ఎవరికి ప్రమాదమూ జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. డాక్టర్ బిఆర్.కోనసీమ జిల్లాలో సుమారు 27 వేల ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు, పెద్దాపురం, సామర్లకోట, గండేపల్లి, జగ్గంపేట, ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల్లో 2,600, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం, తాళ్లపూడి, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలులో 1,500 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది.


డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో నేలకొరిగిన వరి పంటను నిలబెడుతున్న రైతు

ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో మిర్చి, పత్తి, మినుము పంటలు నీటమునిగాయి. ఒంగోలు 18వ డివిజన్ పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలో ఉన్న నల్లవాగు ఉధృతంగా ప్రవహించడంతో జగజ్జీవన్ కాలనీలోకి వరద నీరు చేరింది.

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. బాపట్ల జిల్లాలో వేమూరు, అమృతలూరు, కొల్లూరు, చుండూరు మండలాల్లో వరి పంట నేలవాలింది.

ప్రకాశం బ్యారేజీకి వరద

విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి 56,902 క్యూసెక్కుల వరద నీరు వచ్చి వస్తుండడంతో బ్యారేజీ 64 గేట్లను అడుగు, అయిదు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 52,378 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి, కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 511 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 12 అడుగులు కాగా, ప్రస్తుతం 11.5 అడుగుల మేర కొనసాగుతోంది.

సముద్రతీరంలో ‘గ్రేట్ గ్రీన్ వాల్’ ప్రాజెక్టు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్


మొక్కను నాటుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - ఉంగుటూరు (గన్నవరం)/అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంత రక్షణకు శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ‘గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్’ ప్రాజెక్టును త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల వర్క్‌షాపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మడ అడవుల అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల కళాకారుల అవసరాల కోసం అంకుడు, తెల్లపొనికి వంటి చెట్ల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అటవీ భూముల సంరక్షణలో ఎటువంటి రాజీలకు తావులేదని, అడవులు జాతి సంపదని, వాటి సంరక్షణలో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లనూ ప్రభుత్వం అనుమతించబోదని తెలిపారు. అటవీ సిబ్బంది భద్రతకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి ‘గ్రేట్ గ్రీన్ వాల్’ ప్రచార పోస్టర్లను విడుదల చేసి, జమ్మి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, ఆర్‌డిఒ బాలసుబ్రమణ్యం, అటవీ శాఖాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పిఎల పాలన

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

రాష్ట్రంలో పిపిపి పేరుతో పిఎల పాలన సాగుతోందని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకొని ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం విజయనగరంలోని అమర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం మాటలకూ, చేతలకూ చాలా తేడా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని వారి భుజాలపైన పెట్టుకొని మోస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ఎంపిలు రాష్ట్రానికి రావాల్సినవి తెప్పించేందుకు ఏం చేశారని ప్రశ్నించారు. విద్యార్థులకు రూ.6,800 కోట్లు ఫీజు రియంబర్సుమెంట్, నిరుద్యోగులకు మూడు వేలు భృతి, మహిళలకు రూ.1500, నిరుద్యోగులకు 20 లక్షలు ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వైసిపి హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు వస్తే వాటిని నడపలేమని మెడికల్ సీట్లను వెనక్కి పంపించే చర్యలు సిగ్గుచేటన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలు సమీకరించి భూ బ్యాంకు పేరుతో భూములు లాగేసుకునే పనిలో చంద్రబాబు ఉన్నారని విమర్శించారు. చివరికి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే పని జరిగినా ఆశ్చర్యపడాల్సిన పని లేదని ఎద్దేవా చేశారు. భూములు కాపాడుకోవడానికి ప్రజల పక్షాన సమర శీల పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పెండింగ్ పనులు పూర్తి చేయండి

- కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని రైల్వే ఉన్నతాధికారులను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆదేశించారు. విజయవాడ రైల్వే డిఆర్‌ఎం మోహిత్ సోనాకియాతో ఆయన శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రైల్వే ప్రాజెక్టుల్లో పెండింగ్ పనుల పురోగతిపై డిఆర్‌ఎంతో పాటు రైల్వే ఉన్నతాధికారులతో సమీక్షించారు. నరసాపురం-కోటిపల్లి రైల్వే లైన్ పనుల్లో జాప్యం, నరసాపురం-మచిలీపట్నం రైల్వే లైన్ పనుల పురోగతి, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనుల తీరు తదితర అంశాలపై చర్చించారు. అలాగే పలు స్టేషన్లలో వివిధ రైళ్ల హాల్ట్ విషయంపైనా ఈ సందర్భంగా చర్చించారు. ఈ భేటీలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజరు పిఇ ఎడ్విన్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజరు సైమన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా సుందరయ్య, సుబ్రమణ్యం

- 13 తీర్మానాలు ఆమోదం
- ముగిసిన 13వ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో


సిహెచ్ సుందరయ్య, కట్టా సుబ్రమణ్యం

ఎపిఎస్‌ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ అధ్యక్షులుగా సిహెచ్ సుందరయ్య (ఏలూరు), ప్రధాన కార్యదర్శిగా కట్టా సుబ్రమణ్యం (నెల్లూరు), కోశాధికారిగా సిహెచ్ అప్పడు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా ఎస్‌కె జిలానీబాష (రాష్ట్ర కేంద్రం), ప్రచార కార్యదర్శిగా టిపిఆర్ దొర (విజయవాడ), ఉపాధ్యక్షులుగా శివకుమార్ (తిరుపతి), జివి సుజాత (ప్రకాశం), పిఎన్‌వి రామేశ్వరరావు (అనకాపల్లి), వి.కృష్ణారావు (నెల్లూరు), ఎం.హరిప్రసాద్ (గుంటూరు), ఎం.నాగేంద్రరావు (నెల్లూరు), అజీమ్‌ఖాన్ (కర్నూలు), రాష్ట్ర కార్యదర్శులుగా ఎ.సీతాలక్ష్మి (విశాఖ), వి.రాములు (విజయనగరం), టి.దశరథ (నెల్లూరు), సిహెచ్ రాజేశ్వరి (నెల్లూరు), పి.తిరుపతి రెడ్డి (బాపట్ల), జి.వినీల (తిరుపతి), కె.శ్రీనివాసులు (తిరుపతి) ఎన్నికయ్యారు. 22 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నికైంది.

తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం వేదికగా జరిగిన 13వ రాష్ట్ర మహాసభలో 13 తీర్మానాలను 200 మంది ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అందులో.. ఎలక్ట్రికల్ బస్సు పాలసీ ఆర్‌టిసి ఉనికికే ప్రమాదమని, ఈ సమస్యపై ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 23న చెన్నైలో జాతీయ సదస్సు జరగనుందని, ఆర్‌టిసి ఉద్యోగ కార్మికుల ఆర్థిక బకాయిలను తక్షణం చెల్లించాలని, 12వ పిఆర్‌సి ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వ బాటలో రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని, 13 గంటల విధానాన్ని రద్దుచేసి, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కోసం సర్క్యులర్ నంబర్ 1/2019 అమలు చేయాలని, స్త్రీ శక్తి పథకం అమల్లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని, రూట్ సర్వేలు నిర్వహించి రన్నింగ్ టైం అమలు చేయాలని, పిఎఫ్ హయ్యర్ పెన్షన్‌లో సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించే చర్యలు ఆపాలని, ఆర్‌టిసి గ్యారేజీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, రవాణా రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, విలువైన ఆర్‌టిసి స్థలాలను కాపాడాలని, మోటార్ వెహికల్స్ సవరణ చట్టం-2019 మార్పులు చేయాలని, మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని తీర్మానించారు. రెండు రోజుల మహాసభలో ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కందరపు మురళి తదితరులు హాజరయ్యారు.

పారిశ్రామికవేత్తల కోసమే కార్మిక చట్టాల సంస్కరణలు

- ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పారిశ్రామికవేత్తల కోరిక మేరకే తాము కార్మిక చట్టాల్లో సంస్కరణలు తీసుకొచ్చామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మెల్‌బోర్న్‌లోని ఆస్ట్రేలియా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులతో నిర్వహించిన సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో లోకేష్ శుక్రవారం మాట్లాడారు. దేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కలిసి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో చేయాల్సిన విధానపరమైన మార్పులు గుర్తించి, వాటిని అమలు చేసే పనిలో ఉన్నామని తెలిపారు. ఇందుకు ఉదాహరణ కార్మిక చట్టాల్లో సంస్కరణలు అని తెలిపారు. 9 సంస్కరణల్లో మార్పులు చేయాలని సూచిస్తే తాము 8 సంస్కరణలను 15 రోజుల్లోనే పూర్తి చేశామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్‌గా మార్చడమే తమ లక్ష్యమని ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్(ఆస్ట్రేడ్) ఎగ్జిక్యూటివ్‌లతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో చెప్పారు. అన్ని రంగాల్లో రాష్ట్రంలో విశేష పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికబద్ధంగా, వేగవంతంగా ముందుకు సాగుతోందన్నారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించబోతున్న పార్టనర్‌షిప్ సమ్మిట్-2025కు ఆస్ట్రేలియన్ పారిశ్రామికవేత్తలు హాజరై రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా రాష్ట్రంలో లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఎపి (లీప్) కార్యక్రమాన్ని ఈ ఏడాది నుంచి అమలు చేస్తున్నామని ఆస్ట్రేడ్ నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ రౌండ్‌టేబుల్‌లో చెప్పారు. రాష్ట్ర, విక్టోరియాలలో క్రికెట్ క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంచేందుకు ఉమ్మడి శిక్షణ శిబిరాలు, స్నేహపూర్వక మ్యాచ్‌లు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ విక్టోరియా ఎగ్జిక్యూటివ్‌లను లోకేష్ కోరారు. భారత్‌లో క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు విక్టోరియా ప్రతినిధులు తెలిపారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవలను పునరుద్ధరించాలి

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) పథకాన్ని అమలు చేస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు వెంటనే చెల్లించి, పేదలకు వైద్య సేవలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య శుక్రవారం లేఖ రాశారు. బకాయిలు చెల్లించకపోవడంతో గత 14 రోజులుగా ఎన్‌టిఆర్ వైద్య సేవలు నిలిచిపోయాయని లేఖలో పేర్కొన్నారు. బకాయిలు చెల్లించాలని 6 నెలలుగా నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు రెండు పర్యాయాలు సేవలు నిలిపేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అనారోగ్యంతో వెళ్లిన వారికి ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం కింద సేవలు అందించలేమని, డబ్బు చెల్లిస్తేనే వైద్యం అందిస్తామని నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయన్నారు.

ప్రైవేటు రంగ కార్యకలాపాలు క్షీణత

- ఐదు నెలల కనిష్టానికి పిఎంఐ
- యుఎస్ టారిఫ్‌ల ప్రభావం

న్యూఢిల్లీ : దేశంలో ప్రయివేటు రంగ కార్యకలాపాల్లో స్తబ్దత చోటు చేసుకుంటుంది. డిమాండ్ బలహీనంగా ఉండటం, ఉత్పత్తి వ్యయాలు పెరగడం వ్యాపార ఆశావాదంపై ప్రతికూల ప్రభావం చూపాయని హెచ్‌ఎస్‌బిసి తన ఫ్లాష్ ఇండియా కంపోజిట్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ)లో తెలిపింది. ఈ పరిణామాలతో అక్టోబర్‌లో పిఎంఐ 59.9 కి పడిపోయిందని... ఇది ఐదు నెలల కనిష్ట స్థాయి అని వెల్లడించింది. ఇది రాయిటర్స్ పోల్ అంచనా 61.2 కంటే తక్కువ. ఇంతక్రితం సెప్టెంబర్‌లో ఇది 61.0గా నమోదయ్యింది. మే నెల నుండి అత్యల్ప స్థాయి అయినప్పటికీ 50 మార్కు పైన ఉండటం వల్ల కొంత ఆశావాదం నెలకొంది. సేవల రంగంలో మందగించిన వృద్ధి ఈ క్షీణతకు ప్రధాన కారణం. అయితే తయారీ రంగం సెప్టెంబర్‌లో నాలుగు నెలల కనిష్ఠ స్థాయి నుండి కొంత కోలుకొంది. తయారీ పిఎంఐ 57.7 నుండి 58.4కి పెరగగా, సేవల వ్యాపార కార్యకలాపాల ఇండెక్స్ 60.9 నుండి 58.8కి పడిపోయింది.

ఈ ఏడాది మే నెల నుండి కొత్త ఆర్డర్‌లు నెమ్మదించాయి. ట్రంప్ టారిఫ్‌ల అనంతరం సేవల రంగంలో ఉత్సాహం కోల్పోవడం దీనికి ప్రధాన కారణం. అయితే.. వస్తువుల ఉత్పత్తి సెప్టెంబర్ కంటే కొంచెం వేగంగా పెరుగుదలను నమోదు చేసింది. ప్రధానంగా తయారీ ఎగుమతులలో మందగింపునతో అంతర్జాతీయ డిమాండ్ ఏడు నెలల్లో అత్యంత బలహీనంగా నమోదయ్యింది. భారత ఎగుమతులపై అమెరికా అధిక సుంకాలను అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. రష్యన్ చమురు కొనుగోళ్లను ఇండియా ఆపకపోతే సుంకాలు మరింత ఎక్కువగానే ఉంటాయని అధ్యక్షుడు ట్రంప్ పదేపదే హెచ్చరిస్తోన్న విషయం తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమాచారం ప్రకారం.. సెప్టెంబర్‌లో యుఎస్‌కు ఎగుమతులు భారీగా తగ్గాయి. సెప్టెంబర్‌లో అమెరికాకు ఎగుమతులు 20.3 శాతం క్షీణించి 5.5 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇది వరుసగా ఐదో నెల పతనం కావడం గమనార్హం. మరోవైపు సెప్టెంబర్‌లో జిఎస్‌టి తగ్గించడం వల్ల ఖర్చు ఒత్తిడి తగ్గినప్పటికీ, కంపెనీలు ఈ ప్రయోజనాలను ఖాతాదారులకు బదిలీ చేయకుండా, అధిక కార్యకలాపాల ఖర్చులను భర్తీ చేయడానికి విక్రయ ధరలను పెంచాయి. వచ్చే ఏడాది వ్యాపారాలు ఒత్తిడిలో ఉండొచ్చనే అంచనాల్లో జిఎస్‌టి తగ్గింపు ప్రతిఫలాలను వినియోగదారులకు బదిలీ చేయలేదని విశ్లేషించింది.




ధనమ్మ


మిన్నంటిన రోదనలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిజిహెచ్ మార్చురీ వద్ద బస్సు ప్రమాద ఘటన మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. 'రాత్రి 9.30కు ఫోన్ చేస్తే హైదరాబాద్ నాంపల్లి పిల్లర్ దగ్గర బెంగళూరు బస్సు ఎక్కే వాళ్లతో ఉన్నానని, నాతోపాటు మరో ముగ్గురు నా బస్సే ఎక్కేవారు ఉన్నారని నా బిడ్డ చెప్పింది. బస్సు ఎక్కిన తర్వాత ఫోన్ చేస్తానంది. లేట్ అయితే మీ నిద్ర డిస్టర్బ్ చేసినట్లయితే ఉదయం చేస్తానని చెప్పింది. నేను ఉదయం ఆరు గంటల నుంచి ఫోన్ చేస్తే ఫోన్ స్విచాఫ్ అని వచ్చింది. ఉదయం ఏడు గంటల వార్తల్లో హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే బస్సు మంటల్లో కాలిపోయిందని చూశాను. మరో ఛానల్లో అనూష అనే అమ్మాయి చనిపోయింది అనగానే నా గుండె పగిలిపోయింది.' అని యాదాద్రి భువనగిరికి చెందిన మృతురాలు అనూష తండ్రి శ్రీనివాస రెడ్డి రోదించారు. నెల్లూరు జిల్లాకు చెందిన రమేష్ బెంగళూరులో ఉద్యోగం చేస్తూ దీపావళి సెలవులు కావడంతో పిల్లలకు హైదరాబాద్ చూపించాలని రెండు రోజుల టూర్ను ఏర్పాటు చేసుకొని హుస్సేన్సాగర్ వంటి ప్రదేశాలను చూపించారు. తిరుగు ప్రయాణంలో ఆ కుటుంబంలోని నలుగురూ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదాన్ని మిగిల్చింది. మృతురాలు రమేష్ అక్క, అనూష తల్లి ధనమ్మ రోదించిన తీరుకు అందరి గుండెలూ తరుక్కుపోయాయి.



శ్రీనివాసులు రెడ్డి



కుటుంబం మొత్తం ఆహుతి

ప్రమాదంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఓ కుటుంబం మొత్తం ఆహుతైంది. నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గోళ్లవారిపల్లికి చెందిన చెందిన గోళ్ల రమేష్ (35) బెంగళూరులోని హిందుస్తాన్ కంపెనీలో ఉద్యోగిగా పని చేస్తున్నారు. దీపావళికి హైదరాబాద్ వెళ్లారు. భార్య అనూష (30), కుమారుడు శశాంక్ (12), కుమార్తె మాన్యత (10)తో కలిసి కావేరీ ట్రావెల్స్ బస్సులో తిరుగు ప్రయాణం అయ్యారు. బస్సు దగ్ధం కావడంతో ఆ నలుగురూ దుర్మరణం చెందారు.

మృతుల్లో తల్లీకుమార్తె

బస్సు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా శివాయిపల్లికి చెందిన తల్లీకూతుళ్ల సంధ్యారాణి (43), చందన (23) అక్కడికక్కడే మరణించారు. చందన బెంగళూరులో ఓ కంపెనీలో సాఫ్ట్వేర్ జాబ్ చేస్తోంది. దీపావళి పండుగకు వచ్చిన కుమార్తెను బెంగళూరులో విడిచి పెట్టేందుకు తల్లి సంధ్యారాణి కూడా వెంట వెళ్లారు. బస్సు అగ్ని ప్రమాదంలో ఇద్దరూ సజీవ దహనం అయ్యారు.

మిగతా మృతులు వీరే..

నల్గొండ జిల్లా గుండాల మండలం వస్త్రాకొండూరు గ్రామానికి చెందిన మహేశ్వరం శ్రీనివాసరెడ్డి కుమార్తె అనుష (22) బెంగళూరులోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా దీపావళికి ఇంటికి వచ్చి బెంగళూరుకి తిరుగు ప్రయాణమైంది. బస్సు ప్రమాదంలో ఆమె మృతి చెందింది. మృతుల్లో కోనసీమ జిల్లా కొవ్వూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి, బాపట్లకు చెందిన జి ధాత్రి, హైదరాబాద్కు చెందిన గిరిరావు (48), అర్ఘా బందోపాధ్యాయ (23), తెలంగాణకు చెందిన మేఘనాథ్ (25), కర్ణాటకకు చెందిన ఫిలోమెన్ బేబీ (64), కిషోర్ కుమార్ (41), తమిళనాడుకు చెందిన ప్రశాంత్ (32), యువన్ శంకర్ రాజ్ (22), బీహార్కు చెందిన (18), ఒడిశాకు చెందిన కె దీపక్ కుమార్ (24) ఉన్నారు.

డెత్ జర్నీ

(మొదటిపేజీ తరువాయి)

బస్సు ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్తో ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే బస్సు దాదాపూగా కాలి బూడిదైంది. క్షతగాత్రుల్లో 12 మందిని కర్నూలు జిజిహెచ్కు తరలించారు.

బస్సులో ఎందరు..?

ప్రమాద సమయంలో బస్సులో 39 మంది పెద్దలతో పాటు నలుగురు చిన్నారులు ఉన్నారు. వారిలో 23 మంది పెద్దలు, ఇద్దరు చిన్నారులు సురక్షితంగా బయటపడ్డారు. మరణించిన వారిలో 17 మంది పెద్దలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. బస్సులో కాలిబూడిదైన వారిలో ఏపికి చెందిన ఆరుగురు, తెలంగాణకు చెందిన ఆరుగురు, కర్నాటకకు చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, బీహార్, ఒడిశాకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. మృతుల్లో ఒక గుర్తు తెలియని ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, ఇద్దరు సాఫ్ట్వేర్ ఇంజనీర్లు ఉన్నారు. మృతదేహాలు కాలి గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో డిఎన్ఎ పరీక్షలు నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ప్రమాద స్థలాన్ని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత, డిజిపి హరీష్ కుమార్ గుప్తా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య చికిత్స పొందుతున్న బాధితులను మంత్రులు పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రులు వైద్యులను ఆదేశించారు. ఈ ఘటనపై ఉలిందకొండ పోలీస్ స్టేషన్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక డ్రైవర్ శివ నారాయణను అరెస్టు చేశారు. మరో డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్య పరారీలో ఉన్నారు.

ఏం జరిగిందో తెలిసేలోపే..

- అద్దాలు పగలగొట్టుకుని బయట పడ్డాం
- బస్సు దుర్ఘటనలో మృత్యుంజయులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

'ఏం జరిగిందో తెలిసేలోపే బస్సు మొత్తం మంటల్లో కాలిపోయింది. అద్దాలు పగలగొట్టుకుని ఏదోలా బయటపడ్డాం' అని కర్నూలు బస్సు దుర్ఘటనలో బయటపడ్డ మృత్యుంజయులు చెప్పారు. ప్రమాదం నుంచి వారు బయటపడిన తీరును వారు 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు..

ఎమర్జెన్సీ డోర్ నుంచి బయటపడ్డాను



బెంగళూరులో జాబ్ చేస్తున్నాను. ప్రమాద సమయంలో ఎమర్జెన్సీ డోర్ బ్రేక్ చేసుకుని ఎదటి వ్యక్తి దూకిన తర్వాత దూకాను. నాతోపాటు మరో ఆరుగురం దూకి ప్రాణాలతో బయటపడ్డాం. నేను దూకిన తర్వాత వేగంగా మంటలు వ్యాప్తి చెంది బస్సు కాలిపోయింది.

- నవీన్ కుమార్, హైదరాబాద్, హయత్ నగర్

ముందు డోర్ క్లోజ్ చేసి ఉంది



హైదరాబాదులో జాబ్ చేస్తున్నాను. పనిపై బెంగళూరుకు వెళ్తున్నా. శబ్దం రావడంతో మెలుకువ వచ్చి లేచినా బస్సులో పొగ వాసన వచ్చింది. ముందు డోర్ క్లోజ్ చేసి ఉండడంతో ఏం జరిగిందో తెలియలేదు. వెనకాల గ్లాస్ పగలగొట్టుకొని దూకాను. గ్లాస్ పగలగొట్టేలోపే మంటలు ప్రారంభం కావడంతో కష్టంతోటే దూకి ప్రాణాలతో బయటపడ్డాను. కాలు ఫ్రాక్చర్ అయింది.

- సత్యనారాయణ, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా

డోర్లో నుంచి దూకాను



నేను హైదరాబాదులో కోచింగ్ తీసుకుంటున్నాను. వ్యక్తిగత పనిపై బెంగళూరు వెళ్లేందుకు కావేరీ బస్సు ఎక్కాను. పెద్ద శబ్దం వచ్చింది. మెలుకువ వచ్చేసరికి మంటలు వ్యాప్తి చెందడంతో డోర్లో నుంచి దూకి బయటపడ్డాను. నేను బయటకు దూకిన తర్వాత బస్సు మొత్తం కాలిపోయింది.

- ఎస్.హారిక, నెల్లూరు

ఇంటర్వ్యూ కోసం వెళ్తూ..



బిటెక్ పూర్తి చేసి ఇంటర్వ్యూ కోసం హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరాను. ప్రమాదం జరిగిన వెంటనే మంటలు రావడంతో పక్కనే ఉన్న ఎగ్జిట్ డోర్ను పగలగొట్టి దూకాను. దీంతో, రెండు యాంకిల్స్ ఫ్రాక్చర్ అయ్యాయి.

- సూర్య, మియాపూర్, హైదరాబాద్

డ్రైవర్ అలర్ట్ చేయలేదు



బెంగళూరులో ఏషియన్ పెయింట్స్లో సేల్స్ జాబ్ చేస్తున్నాను. బీదర్ నుంచి హైదరాబాద్ వచ్చి అక్కడి నుంచి బెంగళూరుకు కావేరి బస్సు ఎక్కాను. బస్సు దేన్నో ఢీకొన్న శబ్దం వచ్చింది. లేచి చూస్తే బస్సులో పొగ, మంటలు రావడం ప్రారంభమయ్యాయి. వెంటనే గ్లాస్ పగలగొట్టి బయటకు దూకాను. నాతో పాటు ఎనిమిది మంది బయటకు దూకా. ఇంత జరిగినా డ్రైవర్, క్లీనర్ ప్రయాణికులను అలర్ట్ చేయలేదు. చేసి ఉంటే అందరూ బయట పడేవారు.

- ఆకాష్, బీదర్, కర్ణాటక

16 బృందాలతో దర్యాప్తు

ప్రజాశక్తి- కర్నూలు క్రైం

బస్సు ప్రమాదంపై దర్యాప్తు, మృతదేహాలను గుర్తించేందుకు ఫోరెన్సిక్కి సంబంధించి 16 బృందాలను ఏర్పాటు చేసినట్లు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. కర్నూలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. హోం మంత్రి మాట్లాడుతూ డిఎన్ఎ పరీక్షలు చేసేందుకు పది బృందాలు, ప్రమాదానికి కారణాలు అన్వేషించేందుకు నాలుగు బృందాలు, కెమికల్ అనాలసిస్ కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రమాదానికి కారణమైన వారిపైనా తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదానికి కారణాలను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రితో మాట్లాడి ట్రాన్స్పోర్ట్, పోలీస్, రెవెన్యూ శాఖలతో కలిపి ఒక హైపవర్ కమిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హైవేలో బస్సులు ఎంతవేగంతో వెళ్లాలి అనే ఎస్ఒపి కూడా తయారు చేస్తామని చెప్పారు.

ఆ బస్సులో ఫైర్ అలారం సిస్టం లేదు

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదానికి గురైన బస్సులో ఫైర్ అలారం సిస్టం లేదన్నారు. హైవేల మీద ఈ విధంగా అగ్నికి సంబంధించి ఇది 3వ ఘటనని తెలిపారు. ఈ అంశంపై తెలంగాణ, కర్ణాటక రవాణా శాఖ మంత్రులతో నూతన గైడ్లైన్స్ కోసం చర్చించామని చెప్పారు. కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖతో కూడా మాట్లాడి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బస్సులో వివిధ రకాల రాష్ట్రాలకు సంబంధించిన వారు ప్రయాణం చేస్తున్నారని, ఎపికి చెందిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల ఎక్స్గ్రేషియా, క్షతగాత్రులకు రూ.2 లక్షలను సిఎం ప్రకటించారన్నారు.

రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి : సిపిఎం

బస్సు ప్రమాద మృతులకు ట్రావెల్స్ యాజమాన్యం నుంచి రూ.50 లక్షలు ఇప్పించాలని, ప్రభుత్వం మరో రూ.10 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఘటన ప్రాంతాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, ఎండి ఆనంద్ బాబు, టి రాముడు, ఎండి అంజిబాబు, జిల్లా నాయకులు ఎం రాజశేఖర్, ఎం.రంగప్ప పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

రాష్ట్రపతి, మోడీ తదితరుల దిగ్భ్రాంతి

- పిఎంఒ ఎక్స్గ్రేషియా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో/అమరావతి బ్యూరో

కర్నూలు శివారు చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తమనెంతో కలచివేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్గ్రేషియాను ప్రధాన మంత్రి కార్యాలయం ప్రకటించింది. ఈ ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున ఇవ్వనున్నట్లు శుక్రవారం పిఎంఒ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

చాలా బాధాకరం : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

బస్సు అగ్ని ప్రమాదంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమైన విషయం. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేస్తున్నా. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి.

ప్రాణ నష్టం చాలా బాధాకరం : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

బస్సు ప్రమాదంలో జరిగిన ప్రాణ నష్టం చాలా బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి.

తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి : లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

బస్సు అగ్ని ప్రమాదంలో ఎంతో మంది అమాయకులు మరణించిన ఘటన బాధాకరం. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతున్నా. ఇటువంటి పునరావృత ప్రమాదాలు మన ప్రజా రవాణా వ్యవస్థ భద్రతా ఏర్పాట్ల గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రయాణికుల భద్రత అత్యంత ప్రాధాన్యత, వాహన నిర్వహణ బాధ్యతతో పాటు, జవాబుదారీతనం చాలా అవసరం.

తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది : సిఎం చంద్రబాబు

బస్సు దగ్ధమైన ఘటనలో పలువురు మృతి చెందడం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఉన్నత స్థాయి యంత్రాంగం అంతా ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనండి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించండి.

తెలంగాణ మృతులకు రూ. ఐదు లక్షల ఎక్స్గ్రేషియా : సిఎం రేవంత్రెడ్డి

బస్సు ప్రమాదంలో మరణించిన తెలంగాణకు చెందిన ఆరుగురి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షలు చొప్పున, గాయపడిన పది మందికి రూ.రెండు లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం.

చాలా బాధ పడ్డాను : ఎంఎ బేబి, సిపిఎం ప్రధాన కార్యదర్శి

బస్సు అగ్ని ప్రమాదం గురించి విని చాలా బాధపడ్డాను. ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఇలాంటి సంఘటనలు పదేపదే జరుగుతున్నందున బలమైన భద్రతా నిబంధనలను, కఠినమైన జవాబుదారీతనాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

జవాబుదారీతనం అత్యవసరం : ఎఐసిసి అధ్యక్షులు, మల్లికార్జున ఖర్గే

బస్సు అగ్ని ప్రమాదంలో అనేక విలువైన ప్రాణాలను కోల్పోయాం. ఇది చాలా విషాదకరమైన, తీవ్ర బాధాకరమైన సంఘటన. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికుల కుటుంబాలకు నా సంతాపాన్ని తెలియచేస్తున్నా. ఇలాంటి పునరావృత సంఘటనలకు జవాబుదారీతనం అత్యవసరం.

దిగ్భ్రాంతికి గురి చేసింది : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

ఈ ప్రమాద ఘటన నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రియమైన వారిని కోల్పోయిన మృతుల కుటుంబాలకు నా సానుభూతి వ్యక్తం చేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా.

భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు : డిప్యూటీ సిఎం పవన్కల్యాణ్

బస్సు ప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని డిప్యూటీ సిఎం పవన్కల్యాణ్ తెలిపారు. ఈ ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా రవాణా శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు.

తీవ్ర బాధాకరం : వైసిపి అధినేత వైఎస్ జగన్

బస్సు ప్రమాదం తీవ్ర బాధాకరమైన ఘటనగా వైసిపి అధినేత వైఎస్ జగన్ పేర్కొన్నారు. తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం అవసరమైన సాయాన్ని అందజేయాలని కోరారు.

రూ.50 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలి: సిపిఎం రాష్ట్ర కమిటీ

బస్సు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులతో సహా 20 మంది మరణించడం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు.. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమగ్ర విచారణ జరపాలి: సిపిఐ

బస్సు ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం.. మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్గ్రేషియా చెల్లించాలని కోరారు.

అత్యంత విచారకరం : కాంగ్రెస్

ట్రావెల్ బస్సు ఘోర ప్రమాదం అత్యంత విచారకరమైన ఘటనగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. బస్సులోనే కొందరు ప్రయాణికులు సజీవ దహనం అవ్వడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉన్నత స్థాయి విచారణకు డిమాండ్ చేశారు.

సీటింగ్ అనుమతితో స్లీపర్గా నడుపుతూ...

- వెలుగులోని వేమూరి కావేరి ట్రావెల్స్ బాగోతం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి : కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో 19 మందిని ఆహుతి చేసిన వేమూరి కావేరి ట్రావెల్స్ బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ప్రమాదానికి గురైన బస్సు సీటింగ్ అనుమతి తీసుకుని స్లీపర్గా నడుపుతున్నట్లు తేలింది. వేమూరి కావేరి ట్రావెల్స్ పేరిట హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విశాఖపట్నం రూట్లలో టూరిస్టు పర్మిషన్లతో పర్యాటక ప్రాంతాలకు బస్సులను తిప్పే సంస్థగా నమోదైంది. తెలంగాణకు చెందిన హెబ్రాన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ బస్సును 2018లో కొనుగోలు చేసి 2023 వరకు నిర్వహించింది. ఆ తర్వాత వేమూరి వినోద్ కుమార్ ఈ బస్సును కొనుగోలు చేసి ఎన్ఒసి తీసుకుని కేంద్రపాలిత ప్రాంతమైన డయ్యూ డామన్లో తిరిగి రిజిస్ట్రేషన్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేస్తే అధికారులు కొంత కఠినంగా ఉంటారన్న అంచనాతో అక్కడ రిజిస్ట్రేషన్ చేశారు. వాస్తవానికి ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఉంది. డయ్యూ డామన్లో ఆల్ ఇండియా పర్మిట్ తీసుకున్న కావేరి ట్రావెల్స్ ఒడిశాలోని రాయగడలో అటెస్టేషన్, ఫిట్నెస్ చేయించుకున్నారు. రాయగడ అధికారులు అటెస్టేషన్, ఫిట్నెస్ మంజూరు చేసేటప్పుడు బస్సు సామర్థ్యం, సీటింగ్ వివరాలను స్పష్టంగా పొందుపరిచారు. కేవలం ప్రమాదానికి గురైన బస్సుకు 43 సీట్ల సీటింగ్ పర్మిషన్ మాత్రమే ఇచ్చారు. కానీ, కావేరి ట్రావెల్స్ సంస్థ స్లీపర్ బస్సుగా మార్చింది. డయ్యూ డామన్ సీటింగ్ సామర్థ్యం ఉన్న బస్సు రవాణా పన్ను ఒక్క సీటుకు రూ.450 మాత్రమే. అదే స్లీపర్ సీటు అయితే రూ.800 అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఒక్క సీటుకు రూ.4,500 పన్ను చెల్లించాలి. అదే స్లీపర్ సీటుకు అయితే రూ.12 వేల చొప్పును ప్రభుత్వానికి ట్యాక్స్ కట్టాలి. ట్యాక్స్లను ఎగవేసేందుకే వేమూరి కావేరి ట్రావెల్స్ సంస్థ అక్రమ రిజిస్ట్రేషన్ చేయించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ప్రమాదానికి గురైన వేమూరి కావేరి ట్రావెన్స్ బస్సు హైదరాబాద్లో బయలుదేరినప్పటి ఫొటో

16 సార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలు

ప్రమాదానికి గురైన బస్సుపై భారీగా ట్రాఫిక్ జరిమానాలు పెండింగ్లో ఉన్నట్లు తెలుస్తోంది. 2024 జనవరి నుంచి మొత్తం రూ.23,120 ఫైన్లు పెండింగ్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గతేడాది జనవరి 27 నుంచి ఈ ఏడాది అక్టోబర్ 9 వరకు 16 సార్లు బస్సు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. తొమ్మిదిసార్లు నో ఎంట్రీ జోన్లలోకి ప్రవేశించడంతోనూ ఈ బస్సుపై జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనలపైనా చలాన్లు పడినట్లు తెలిసింది.



మృతి చెందిన కవిత

అనారోగ్యంతో గిరిజన విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - సీతంపేట

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మండంగి కవిత (12) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈతమానుగూడ పంచాయతీ డుంబంగి వలసకు చెందిన ఆమె కొద్దిరోజులుగా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్తో బాధపడుతోంది. ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడడంతో ఈ నెల 22న పాఠశాల నుంచి శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గురువారం విశాఖపట్నం కెజిహెచ్కు తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం బాలిక మృతి చెందింది. కవితకు మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు కూడా ఉన్నట్లు తెలిసింది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు బాలకృష్ణ, చామంతి కన్నీరుమున్నీరయ్యారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె కవిత ఉన్నారు. కవిత మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

రైతుల సమస్యలు పరిష్కరించండి

- వ్యవసాయశాఖ స్పెషల్ సిఎస్కు రైతు, కౌలు రైతు సంఘాల వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ప్రారంభించాలని, అదేవిధంగా మొక్కజొన్న, పత్తి, పప్పుశనగ తదితర పంటలకు మద్దతు ధర అమలు, మామిడి, మిర్చి, ఉల్లి తదితర పంటలు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసాయం చెల్లింపు వంటి సమస్యలను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ను రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు శుక్రవారం సచివాలయంలో కలిసి, వినతిపత్రాన్ని అందజేశారు.

నంద్యాల జిల్లాలో మొక్కజొన్న దిగుబడులు ప్రారంభమయ్యాయని, మరికొద్ది రోజుల్లో బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో కూడా దిగుబడులు ప్రారంభమవుతాయని తెలిపారు. 20 రోజులుగా పడుతున్న వర్షాలకు పంటను కాపాడుకోవడం కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.1,600 నుంచి రూ.1,800 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. మార్క్ఫెడ్ ఆధ్వర్యాన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.2,400 చెల్లించి పంటను కొనుగోలు చేయాలన్నారు.

- రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో పత్తిని సాగుచేయగా, కర్నూలు జిల్లాలోనే 6 లక్షల ఎకరాలు సాగు చేశారని తెలిపారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలను తెరిపించి క్వింటా రూ.8,110కు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- అక్టోబరు ఒకటి నుంచి రబీ సీజన్ ప్రారంభమైందని, అనంతపురం, కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల్లో పప్పు శనగ విత్తనాలు నాటేందుకు సమయాత్తం అవుతుండగా, అనంతపురం జిల్లాలో రైతులకు రాయితీపై విత్తనాలు ఇవ్వనే లేదన్నారు. గత మూడు నాలుగేళ్లుగా పండించిన పప్పు శనగ పంటకు ధర లేక గోదాముల్లోనే ఉంచారని, క్వింటాకు రూ.10 వేలు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొంత మంది మామిడి రైతులకు ప్రభుత్వం అందజేసిన మార్కెట్ ఇనర్వెన్షన్ స్కీం నగదు జమ కాలేదని, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు కాకుండా, ఎకరాకు రూ.50 వేలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. టమోటాకు కిలో రూ.15 ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి పొగాకు రైతులకు నగదు జమ చేసిందని, కొంత మంది రైతులకు ఈ నగదు జమకానందున పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని పంటలకూ ఉచిత బీమా సౌకర్యం అమలు చేయాలని కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, ఆదివాసీ సంఘ నాయకులు, గిరిజనులు

అక్రమ సర్వే చేస్తే ప్రతిఘటన

- వామపక్ష, ఆదివాసీ సంఘం నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - బూర్జ (శ్రీకాకుళం జిల్లా)

థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదిత గ్రామాల్లో రైతుల అనుమతి లేకుండా అక్రమంగా సర్వే చేస్తే ప్రజా ప్రతిఘటన తప్పదని వామపక్ష, ఆదివాసీ సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అక్రమ సర్వేను నిరసిస్తూ మండలంలోని అడ్దూరిపేటలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమ సర్వేను నిరసిస్తూ ఈనెల 27న సరుబుజ్జిలి మండల కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. థర్మల్ ప్లాంట్ పేరుతో ప్రజల భూములను బలవంతంగా గుంజుకొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి ఎందుకు చూస్తున్నారని కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడిని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చివర భూముల వరకు రెండు పంటలకు నీరిస్తే జిల్లా సస్యశ్యామలమవుతుందని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగి జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ఉపాధ్యక్షులు వంకల మాధవరావు, ఆదివాసి వికాస పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం


మహా గట్‌బంధన్ సవాల్

బీహార్ శాసనసభ ఎన్నికలను ఎదుర్కొంటున్న ఇండియా బ్లాక్ (మహా గట్‌బంధన్) తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్‌ను ఏకాభిప్రాయంతో ప్రకటించి అధికార జెడియు నేతృత్వంలోని ఎన్‌డిఎకి తిరుగులేని సవాల్ విసిరింది. అంతేకాదు, ఎన్నికలకు ముందుగానే తమ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) అధ్యక్షుడైన ముఖేష్ సహాని పేరును సైతం ప్రకటించి ఎన్నికల సమరానికి సై అంది. ఇండియా బ్లాక్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఇంతకాలం ప్రతిపక్ష ఇండియా బ్లాక్‌లో ఐక్యత లేదంటూ బిజెపి, జెడియు దళం లంకించుకున్న ప్రచారాన్ని తిప్పికొట్టినట్లయింది. మహా గట్‌బంధన్ ఇచ్చిన షాక్‌తో ఎన్‌డిఎ పరిస్థితి గుక్కతిప్పుకోలేకుండా ఉంది. తమ భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో ఎలాంటి ఇబ్బందులూ లేవని డాంబికాలు పలుకుతున్న ఎన్‌డిఎ తమ సిఎం అభ్యర్థి ఎవరో ఎన్నికల అనంతరమే ప్రకటిస్తామని బిజెపి, అమిత్‌షా దాటవేస్తూ వచ్చారు. జెడియు చీఫ్, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్‌డిఎ ఎన్నికలకు వెళుతోందని అంటూనే, ఈ సారి నితీష్ సిఎం అవుతారన్న గ్యారంటీ లేదని చెప్పకనే చెప్పారు. దీన్నిబట్టి నితీష్ మెడపై బిజెపి కత్తి వేలాడతీసిందని అర్థమవుతుంది.

బీహార్‌లో గత దశాబ్దంన్నరలో నితీష్ వేసిన వేషాలు అన్నీ ఇన్నీ కావు. పదవే లక్ష్యంగా కూటములు ఫిరాయించిన చరిత్ర ఆయన స్వంతం. ఆయన విధానాన్ని బిజెపి అందివచ్చిన ప్రతిసారీ వల వేసి ఉపయోగించుకుంది. 2020 అక్టోబర్-నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బిజెపి పంచన చేరి నితీష్ సిఎం అయ్యారు. ఆ పార్టీ తనను ఇబ్బంది పెడుతోందని పదవికి రాజీనామా చేసి మహా గట్‌బంధన్ వైపు వచ్చి తిరిగి సిఎం అయ్యారు. రెండేళ్లన్నా గడవక ముందే, సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముంగిట 2024 జనవరిలో ఎన్‌డిఎ తీర్థం పుచ్చుకొని పదవి కాపాడుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి కావాల్సిన సీట్లు తగ్గగా తన సీట్లతో భుజం కాసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ పార్టీకి బిజెపి కంటే తక్కువ సీట్లొచ్చినా ఆయన్నే సిఎం కుర్చీలో కూర్చోబెట్టామంటున్న బిజెపి ప్రస్తుత ఎన్నికల్లో తన గొంతును సవరిస్తోంది. మొత్తం 243 సీట్లలో బిజెపి, జెడియు చెరో 101 పోటీ చేసి, తతిమ్మా స్థానాలను తమ పార్టనర్లకు కేటాయించాయి. కూటమి విస్తృత ప్రయోజనాల కోసం తాము గతంలో పోటీ చేసిన సీట్ల కంటే ఇరువురం దిగొచ్చి తగ్గించుకున్నామని బిజెపి చెబుతున్నదాంట్లో నిజం కనిపించదు. రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ జెడియును మింగేసి ఆ స్థానాన్ని బిజెపి ఆక్రమిస్తోందని కొన్నేళ్ల బీహార్ రాజకీయ పరిణామాలను బట్టి తెలుస్తుంది. బిజెపి ఈ నైజం పలు రాష్ట్రాల్లో ఇప్పటికే రుజువైంది. అందుకు తార్కాణం మహారాష్ట్రనే. సిఎం ఏక్‌నాథ్ షిండే (శివసేన (గ్రూపు) నేతృత్వంలో ఎన్‌డిఎ అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్నప్పటికీ...బిజెపికి ఎక్కువ సీట్లు రావడంతో సిఎం పదవిని బిజెపి తీసుకొని కూటమి పొత్తు ధర్మానికి నీళ్లొదిలింది. అటువంటిదే బీహార్‌లో నితీష్ విషయంలో బిజెపి చేయదని గ్యారంటీ లేదు.

బీహార్‌లో గెలిచేందుకు బిజెపి తొక్కని అడ్డదార్లు లేవు. ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేసి ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్)ను ప్రయోగించింది. ఇ.సి కి ఎంతమాత్రం సంబంధం లేని పౌరసత్వ నిర్ధారణ అంశాన్ని చేర్చేలా పావులు కదిపింది. దీనిపై ప్రతిపక్షాలు సుప్రీం కోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ఏకంగా 65 లక్షల ఓట్లు తొలగించారు. దీనిపై విచారణకు సుప్రీం కోర్టు ఆదేశించినా ఇంకా పూర్తి స్థాయిలో విచారణ లేదు. ఓట్ల చోరీపై మహా గట్‌బంధన్ పెద్ద ఆందోళనే చేసింది. రెండు దశల ఎన్నికల్లో అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు గురువారంతో తుది గడువు ముగిసింది. మహా గట్‌బంధన్‌కు సంబంధించి 11 సీట్లలో స్నేహపూర్వక పోటీలు కొనసాగుతున్నాయి. నితీష్ ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని ఇప్పటికే ముందస్తు సర్వేలు చెప్తున్నాయి. రాజ్యాంగ విధ్వంసానికి, నిరంకుశత్వాన్ని పాదుకొల్పుతున్న బిజెపిని నిలువరించడం అత్యవసరం. బీహార్‌లో బిజెపి, దాని మిత్రులను ఓడిస్తేనే కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వ మతతత్వ-కార్పొరేట్ విధానాలకు కొంత మేరకైనా బ్రేకులు పడతాయి. ఆ లక్ష్య సాధన కోసం తమలోని చిన్న చిన్న ఇబ్బందులను పరిష్కరించుకొని మహా గట్‌బంధన్ పని చేయాలని రాజ్యాంగ ప్రేమికులు, ప్రజాస్వామ్యవాదులు కోరుకుంటున్నారు.

మంచి మాట



దురలవాట్లు మొదట్లో సాలెగూళ్ళ లాంటివి. తర్వాత అవి ఇనుప గొలుసులై మనల్ని బంధిస్తాయి.
- లాంగ్ ఫెలో,
అమెరికన్ కవి, విద్యావేత్త.

దళితులపై విషపూరిత దాడుల వెనక...

మహాభారతంలో ఏకలవ్యుడి కథ అందరికీ బాగా తెలిసిందే. అయితే దాన్ని పాండవుల వీరత్వ గాథల్లోనూ, వారి ధర్మ పోరాటం గొప్పల మాటునా దాచేశారు. యుద్ధ విద్యా నైపుణ్యం సంపూర్ణంగా కైవసం చేసుకోవడానికి ఏకలవ్యుడు సల్పిన నిర్విరామ కృషి పట్ల ద్రోణాచార్యుడు కనబర్చిన పరమ క్రూరత్వం కాలాతీతమైన ఈ ఇతిహాసంలో ఒక అపశ్రుతిలా తారసిల్లుతుంది. గతాన్ని తిరిగి తీసుకొచ్చే వినాశకర ప్రయత్నాలలో వున్న నవీన హిందూత్వ ప్రచారకులు ఆ ఘోర కుల వివక్షతలనే 'ప్రజాస్వామ్యానికి మాతృక' అనే కొత్త ముద్రతో తెచ్చేందుకు తంటాలు పడుతున్నారు. ఐ.సి.హెచ్.ఆర్ లో ఆరెస్సెస్ తెచ్చిపెట్టిన కీలక సంచాలకులు ఎర్రకోట బురుజుల పైనుంచి మోడీ చేసిన ప్రచార ప్రవచనాల చలామణి కోసం తప్పుడు దృక్పథాలకు కుహనా చరిత్ర పాఠం జోడిస్తున్నారు. అలాంటి కసరత్తులు సాగుతున్నంత వరకూ ఏకలవ్యుడు పక్కకు నెట్టివేయబడుతూనే వుంటాడు.


సిజెఐపై చెప్పు దాడి

రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తి సిజెఐ గవాయ్‌పై కోర్టు గదిలో ఒక లాయర్ చెప్పు విసిరిన రోజు నుంచి బ్రాహ్మణవాద దురభిప్రాయాలు, సనాతన ధర్మ సమర్థనలు పెరిగిపోతూనే వున్నాయి. వేయి సంవత్సరాల చరిత్ర గల ఖజురాహో దేవాలయ సముదాయంలో విష్ణుమూర్తి విగ్రహానికి పూజలు చేసుకోవడాన్ని అనుమతించాలనే పిటిషన్‌ను గవాయ్ ధర్మాసనం తోసిపుచ్చింది. అలాంటి దారుణమైన ఆ కోర్కెను సంబంధిత చట్టం ఆమోదించబోదని తెలిసినప్పటికీ దాన్ని వారు మొండిగా అడుగుతూ వచ్చారు. చట్టంపైన నమ్మకం ఆధికృత సాధించడం అనుమతించజాలదని చెబుతూ-బహుశా విష్ణుమూర్తి మీ సమస్య పరిష్కరిస్తారేమో చూడండని ఆయన నర్మగర్భంగా వ్యాఖ్యానించడం వారికి మింగుడు పడటం లేదు.

దీనిపై దేశమంతా తీవ్ర నిరసన వ్యక్తమైంది. మామూలుగా ఇలాంటి దుష్టచర్యలపై మౌనం పాటించే ప్రధాని కూడా దాని నుంచి విడగొట్టుకోవలసి వచ్చింది. "భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ గారితో మాట్లాడాను. ఈ రోజున సుప్రీం కోర్టు ప్రాంగణంలోనే దాడి జరగడం భారతీయులందరికీ ఆగ్రహం తెప్పించింది. మన సమాజంలో అలాంటి తుచ్ఛమైన పనులకు అనుమతి వుండదు. అది పూర్తిగా ఖండనీయం. ఇంత జరిగినా కూడా జస్టిస్ గవాయ్ ప్రదర్శించిన నిబ్బరాన్ని నేను అభినందిస్తున్నాను. న్యాయం అనే విలువలను కాపాడ్డానికి, రాజ్యాంగ స్ఫూర్తిని దృఢతరం చేసేందుకు ఆయన ఎంత నిబద్ధతతో వున్నారో దీన్ని బట్టే తెలుస్తున్నది." అని మోడీ ట్వీట్ చేశారు. అయితే మరోవైపున వారి ట్రోల్ బ్రిగేడ్ మాత్రం సోషల్ మీడియాలో రెచ్చిపోతూనే వచ్చింది.

ఐపిఎస్‌తో సహా బలి

మరో దారుణమైన ఘటనలో హర్యానాకు చెందిన ఐపిఎస్ అధికారి పూరణ్ కుమార్ అనుమానాస్పద పరిస్థితులలో మరణించారు. ఆ అధికారి ఆఖరి లేఖలో వెల్లడించిన వివరాలు దిగ్భ్రాంతి కలిగించేవిగా వున్నాయి. దాంతోపాటు కులం గురించిన చిన్నచూపుతో వేధింపులు, అవమానాలు సాగించే తీరు ఎలా వుంటుందో కూడా స్పష్టం చేస్తున్నది. కులపరమైన అవమానాలనూ అణచివేతలనూ బయటపెట్టినందుకుగాను ఒక సీనియర్ పోలీస్ అధికారి ప్రాణాలతో మూల్యం చెల్లించాల్సి రావడం అత్యంత విచారకరమైన విషయం. ఈ వివక్షత, వేధింపుల గురించి ప్రభుత్వానికి అప్పటి హోం మంత్రితో సహా అన్ని స్థాయిలలోనూ ఫిర్యాదులు చేసినప్పటికీ ఆయనకు ఉపశమనం లభించలేదు. ప్రస్తుతం హోంశాఖ ముఖ్యమంత్రి చేతిలోనే వుండటం గమనించదగింది.



> ఊచకోతలు, తరగతి గదుల్లో హింస, విద్వేష దాడులు, మహిళలపై బలాత్కారాలు వంటివన్నీ ఇందుకు ఉదాహరణలే. పోలీసుల నిర్లక్ష్యం, ఉదాసీనత ఈ పోకడలను ఇంకా తీవ్రం చేస్తున్నది. 1950లో భారత రాజ్యాంగం అస్పృశ్యతను నిషేధించింది. అయితే మొదటిసారిగా నిర్దిష్టంగా దళితులు, ఆదివాసులపై సాగే మౌఖిక, భౌతిక, రాజకీయ, తాంత్రిక, ప్రతీకాత్మక హింసలన్నిటినీ అత్యాచారాలని నిర్దిష్టంగా పేర్కొన్నది అత్యాచారాల నిరోధ చట్టమే. అయితే ఈ అత్యాచారాలు ఇంతగా పెరిగిపోతున్నాయంటే ఈ చట్టం కింద పెట్టిన కేసులలో శిక్షలు పడటం చాలా తక్కువగా జరుగుతున్నదనీ, ఆ నిందితులలో అత్యధికులు అసలు కోర్టుల వరకూ రావడమే లేదని అర్థమవుతుంది.

PEOPLE'S DEMOCRACY

2025 అక్టోబర్ ఒకటవ తేదీన ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో హరిఓం అనే దళితుడిని అమానుషంగా చంపేశారు. అతనేదో "డ్రోన్ల దొంగ" అని ఆరోపించారు. తనను క్రూరంగా కొట్టి రైల్వే పట్టాల పక్కన పడేసి పోతే తర్వాత గాయాలతో మరణించాడు. ఉత్తరప్రదేశ్‌లో దళితులపై ఊచకోత ప్రమాదకర స్థాయికి చేరింది. 2022లో షెడ్యూల్డు కులాలకు సంబంధించిన చట్టం కింద 51,656 కేసులు నమోదైతే వాటిలో 12,287 అంటే 23.78 శాతం యు.పి లోనే. 8651 కేసులు (16.75 శాతం)తో ఆ తర్వాత స్థానంలో రాజస్థాన్, 7732 (14.97శాతం)తో మధ్యప్రదేశ్ వున్నాయి. పార్లమెంటులో ఈ విషయమై ప్రభుత్వం ఇచ్చిన నివేదికలన్నీ పెరుగుదలనే సూచిస్తున్నాయి.

భావజాల భూమిక

ఇదేదో కేవలం వట్టి అంకెల పెరుగుదల మాత్రమే కాదు. రోజువారీగా మనం దళితులపై జరుగుతున్న అత్యాచారాలు, నేరాలు చూస్తుంటే పరిస్థితి తీవ్రత తెలుస్తుంది. ఊచకోతలు, తరగతి గదుల్లో హింస, విద్వేష దాడులు, మహిళలపై బలాత్కారాలు వంటివన్నీ ఇందుకు ఉదాహరణలే. పోలీసుల నిర్లక్ష్యం, ఉదాసీనత ఈ పోకడలను ఇంకా తీవ్రం చేస్తున్నది. 1950లో భారత రాజ్యాంగం అస్పృశ్యతను నిషేధించింది. అయితే మొదటిసారిగా నిర్దిష్టంగా దళితులు, ఆదివాసులపై సాగే మౌఖిక, భౌతిక, రాజకీయ, తాంత్రిక, ప్రతీకాత్మక హింసలన్నిటినీ అత్యాచారాలని నిర్దిష్టంగా పేర్కొన్నది అత్యాచారాల నిరోధ చట్టమే. అయితే ఈ అత్యాచారాలు ఇంతగా పెరిగిపోతున్నాయంటే ఈ చట్టం కింద పెట్టిన కేసులలో శిక్షలు పడటం చాలా తక్కువగా జరుగుతున్నదనీ, ఆ నిందితులలో అత్యధికులు అసలు కోర్టుల వరకూ రావడమే లేదని అర్థమవుతుంది.

ఒక ఉద్వేగభరిత చర్చ గతంలో దేశమంతా ఆవేశం నింపింది. రాజ్యసభలో రాజ్యాంగంపై జరిగిన చర్చ సందర్భంలో రెచ్చిపోయిన అమిత్‌షా కోపతాపాలు కట్టు తప్పాయి. అలా జరగడం అంతకు ముందు కొద్ది సంవత్సరాల కిందట ఊహించగలిగేవాళ్లం కూడా కాదు. దేశంలో బాబాసాహెబ్ పేరు జపించడం ఫ్యాషన్‌గా మారిందని చాలా రెచ్చగొట్టే రీతిలో అమిత్‌షా వ్యంగ్యంగా నోరు పారేసుకున్నారు. అవహేళనగా మాట్లాడారు. పదేపదే అంబేద్కర్ పేర కేకలేస్తే స్వర్గంలో దేవుడితో లీనమవుతామని వారు భ్రమపడుతున్నారని ఆయన దబాయించారు. దేవునితో లీనం కావడమే మనిషికి అంతిమ మోక్షమని చెప్పే నిచ్చెనమెట్ల బ్రాహ్మణీయ వ్యవస్థను తీసుకొచ్చే ప్రయత్నమే ఆయన మాటలన్నది చాలా స్పష్టం.

బ్రాహ్మణీయ బోధనలు

అన్ని రాజ్యాంగ వ్యవస్థలనూ చేతిలో పెట్టుకుని చాలా రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా నాయకత్వం వహిస్తున్న బిజెపి రాజ్యాంగాన్ని భూస్థాపితం చేయాలనీ, హిందూత్వ రాజ్యాన్ని పాదుకొల్పాలని తహతహలాడుతోంది. భిన్నత్వంలో ఏకత్వం అన్న సూత్రంపై ఆధారపడి భారత జాతీయత ఆవిర్భవించింది. సమ్మిళిత సమాఖ్య బహుళ సంస్కృతుల రాజకీయ వ్యవస్థతో కలసి వుండే సూత్రమది. కానీ ఆరెస్సెస్ దాని స్థానంలో మత ప్రాతిపదికగా నడిచే జాతీయతను రుద్దాలని చూస్తున్నది. గోల్వాల్కర్ చెప్పినట్టు హిందూయేతరులను దిగువ స్థాయి ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడాలంటోంది. భిన్నత్వం వున్నా సమాన పౌరసత్వం అనే భావనకే విరుద్ధమైన కొత్త నిర్వచనం ఇది. ఆరెస్సెస్ చెప్పే ఏకపక్ష ఫాసిస్టు హిందూ రాజ్య పథకాన్ని అడ్డుకోవడానికి ఇప్పటివరకూ రాజ్యాంగం శిలాసదృశంగా దృఢంగా అడ్డుకుని నిలబడింది.

బ్రాహ్మణీయ సామాజిక వ్యవస్థనూ, మనుధర్మ సూత్రాలనూ న్యాయబద్ధం చేసేందుకు బరితెగించి చేస్తున్న ఈ కసరత్తుపై ఎలాంటి వివరణా అవసరం లేదు. ఇదేదో యాదృచ్ఛికంగా జరుగుతున్నదీ కాదు. భారత రాజ్యాంగం పట్ల, బాబాసాహెబ్ అంబేద్కర్ పట్ల ఆరెస్సెస్‌కు గల వ్యతిరేక భావన చరిత్రలో బాగా నమోదై వున్నదే. అమిత్‌షా దాన్నే వెల్లడించారు. రాజ్యాంగం మౌలిక సూత్రాలపట్ల ఆమూలాగ్రం వ్యతిరేకతను అవి ప్రతిబింబిస్తున్నాయి. రాజ్యాంగానికి పునాదిగా నిలిచిన సామాజిక లింగ సమానత్వాన్ని వెనక్కు కొట్టాలని చూస్తున్నాయి.

తక్షణం జరగాల్సింది

సావర్కర్ వ్యాఖ్యానాలు వారి భావజాలం నిజస్వరూప లోతులు చెబుతున్నాయి. రాజ్యాంగం భారతీయేతరం అని ఆయన బండగా చెప్పేశాడు. రాజ్యాంగ ప్రక్రియకు ప్రాచీన స్మృతిశాసనమైన మనుస్మృతి మార్గదర్శకం కావాలని కీర్తించాడు. 1949 నవంబరు 30న ఇవే భావాలను వారి అధికార పత్రిక ఆర్గనైజర్‌లో ఆరెస్సెస్ సుస్పష్టంగా ప్రకటించింది. "నూతన రాజ్యాంగానికి భారతీయత లేదనీ అది భారత ప్రజల సంస్కృతీ మత విశ్వాసాలకు విదేశీయమైందనీ ఆర్గనైజర్ రాసింది. రాజ్యాంగం కన్నా మనుస్మృతిపై నిరంతర ధ్యాస ఆరెస్సెస్ ఆలోచనల్లో గూడుకట్టుకుని వుంటుంది. లౌకిక ప్రజాస్వామిక రాజ్యాంగానికీ... హిందూత్వ శక్తులు వాంఛించే మత రాజ్యానికీ మధ్యలో అదే సైద్ధాంతికంగా గట్టి అడ్డంకి అవుతుంది. మత రాజ్యం పట్ల హిందూత్వ శక్తులు మొగ్గు చూపుతాయి. మనుస్మృతి వర్ణవివక్షను పెంచాలంటుంది. భారత రాజ్యాంగం చెప్పే సమ్మిళిత సమానతా సూత్రాలకు ఇది పూర్తిగా, ప్రత్యక్షంగా విరుద్ధం.

సమానత్వం, సామాజిక న్యాయం ఆధారభూతాలుగా ఒక న్యాయమైన సమాజానికి పునాది వేసేందుకు రాజ్యాంగం దోహదం చేసింది. దీన్ని, ఇప్పుడు సాగుతున్న ధోరణిని ఒకటిగా చెప్పడమంటే ఈ వారసత్వానికిగల దీర్ఘకాలిక ప్రాధాన్యతను దెబ్బ తీయడమే అవుతుంది. ఆరెస్సెస్ ఇదివరకటి కాలంలో అంబేద్కర్ వారసత్వంతో నేరుగా ఘర్షణ వస్తుందనే భయంతో అస్పష్టంగా మాట్లాడుతూ వచ్చింది. దానివల్ల తన ఎన్నికల అవసరాలకు నష్టం కలగవచ్చునని జంకింది. అయితే వారు చెప్పే నిచ్చెనమెట్ల వెలి సిద్ధాంతాలకు ఇంక ఏ మాత్రం ముసుగు అవసరం లేకుండా పోయింది. రాజ్యాంగ నిర్మాతలు చాటి చెప్పిన రాజ్యాంగ సూత్రాలు చారిత్రికంగా హిందూత్వ శక్తులకు ఏనాడూ మింగుడు పడలేదు. ప్రస్తుతం మనం చూస్తున్న విషపూరితమైన దుందుడుకు దాడుల సారాంశం అదే. కనక హిందూత్వ దళిత వ్యతిరేకతను ఎదుర్కోవడం ఇప్పుడు తక్షణ అవసరంగా మారుతున్నది.

(అక్టోబర్ 22 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

విశ్లేషణ

పట్టణ మంచినీటి ప్రైవేటీకరణ - కూటమి ఘాతుకం



డా॥బి. గంగారావు

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో మంచినీరు, మురుగునీటి వ్యవస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్తూ 82, 214 జీవోలను విడుదల చేసింది. వీటిలో కొత్తగా చేపట్టబోతున్న మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, శుద్ధి ప్లాంట్ల నిర్మాణంతో పాటు ఆపరేషన్, నిర్వహణ మొత్తాన్ని పదేళ్ళ పాటు బడా ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయబోతున్నారు. దీనికి కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (చామ్) అనే పేరు తగిలించారు. పైపెచ్చు గత వైసిపి ప్రభుత్వం అమృత్ పథకం కింద నిధులు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించిందని విమర్శిస్తూ, అమృత్ నిధులు కోల్పోకుండా కేంద్రాన్ని ఒప్పించి రాష్ట్రానికి తీసుకోస్తున్నామని కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్తున్నది.

కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్-2.0 (అటల్ పునరుద్ధరణ, పట్టణాల రూపాంతరీకరణ మిషన్) పథకంలో రాష్ట్రంలోని మొత్తం 121 నగరాలు, పట్టణాల్లో మంచినీరు, మురుగునీటి సదుపాయాల మెరుగుదలకు రూ.10,251 కోట్లు విలువగల 281 ప్రాజెక్టు పనులను కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (చామ్) పద్ధతిలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చింది. టెండర్ల ప్రక్రియ ప్రారంభించింది. ఈ మొత్తం నిధుల్లో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద వాటాగా రూ. 2470 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.2490 కోట్లు, పట్టణ స్థానిక సంస్థల వాటా రూ. 590 కోట్లుగా తేల్చారు. పట్టణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం కింద కేంద్రం నుండి వచ్చే రూ.590 కోట్లను కూడా ఈ ప్రాజెక్టులకు జమేయాలని నిర్ణయించారు. మొత్తం 281 పనులకు పెట్టుబడి వ్యయంగా రూ.6477 కోట్లుగా నిర్ధారించారు.

ఈ చామ్ మోడల్ ద్వారా కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా ప్రజల సొమ్మును ఎలా కాంట్రాక్టర్లకు కట్టబెడుతున్నదో, రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలలోని మౌలిక సదుపాయాలపై బడా ప్రైవేట్ సంస్థలకు గుత్తాధిపత్యం కల్పిస్తున్నదో జీవోలలో పేర్కొన్న అంశాలు చూస్తే సులభంగా అర్థం చేసుకోవచ్చు. మొత్తం ఈ ప్రాజెక్టు పనుల నిర్మాణానికి అయ్యే రూ.6477 కోట్లు పెట్టుబడి వ్యయంలో కాంట్రాక్టర్ 60 శాతం (రూ. 3886 కోట్లు), మిగిలిన 40 శాతం కేంద్ర, రాష్ట్ర, పట్టణ, స్థానిక ప్రభుత్వాలు భరించాలి. కాంట్రాక్టర్లు పెట్టిన పెట్టుబడికి 10.15 శాతం వడ్డీ రేటుతో లెక్కించి అనగా రూ. 2275 కోట్లు వడ్డీతో అసలును కలిపి పదేళ్లలో 40 వాయిదాల్లో ప్రతి మూడు నెలలకొకసారి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం చెల్లిస్తుంది. అలాగే



ఈ ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తరువాత పదేళ్ల పాటు కాంట్రాక్టర్లే ఆపరేషన్, నిర్వహణ చేస్తారు. ఈ పదేళ్ల నిర్వహణకుగాను స్థానిక పట్టణ సంస్థలు రూ.2275 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాలి. స్థానిక సంస్థలు ప్రత్యక్షంగా కాంట్రాక్టర్లకు చెల్లించవు. రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలి. వాటిని రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లిస్తుంది. ఈ మొత్తం పనులను, నిధులను సమకూర్చడానికి, కాంట్రాక్టర్లకు ఒప్పంద చెల్లింపుల బాధ్యతను ఏపీ పట్టణ ఫైనాన్స్, మౌలిక సదుపాయాల సంస్థకు అప్పజెప్పారు. ఈ సంస్థ తక్షణం ఈ ప్రాజెక్టు పనుల పెట్టుబడి వ్యయంలో ప్రభుత్వం భరించాల్సిన 40 శాతం వాటాలో రూ.2590 కోట్ల నిధులను బాండ్లు, రుణాలు, స్టాక్ మార్కెట్, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల వంటి వాటి ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిధులను కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించటానికి ముందస్తుగా ఇవ్వనున్నది.

ఈ విధానాన్ని అమలు చేయటానికి రాష్ట్రంలోని మొత్తం 123 నగర, పట్టణ స్థానిక సంస్థలను 5 సర్కిళ్ల కింద విడగొట్టారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన చూస్తే అనంతపురం సర్కిల్ పరిధిలో రాయలసీమ జిల్లాలు, నెల్లూరు సర్కిల్ కేంద్రంగా చిత్తూరు నుండి ప్రకాశం వరకు, గుంటూరు, కృష్ణా జిల్లాలు గుంటూరు సర్కిల్‌గా, రాజమండ్రి కేంద్రంగా ఉభయ గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్రలోని పట్టణాలు, నగరాలు అన్ని విశాఖ పట్టణం సర్కిల్‌గా విడగొట్టారు. ఇప్పుడు ఒక్కొక్క సర్కిల్‌ను ఒక్కో కాంట్రాక్టర్ చొప్పున ఐదుగురు బడా కాంట్రాక్టర్ల పరం చేయనున్నారు.

ఈ మొత్తం వ్యవహారం మున్సిపల్ కౌన్సిళ్లకు తెలియకుండానే జరిగిపోతున్నది. ఈ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం 123 మున్సిపల్ కౌన్సిళ్లలో చర్చ పెట్టటంగాని, వారి అభిప్రాయాలు తెలుసుకోవటంగాని, తీర్మానాలు తీసుకోవటంగాని జరగలేదు. మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే ఈ విధానాన్ని రూపొందించి ఏకపక్షంగా అమలుకు పూనుకుంది. ఈ చర్య 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీస్తున్నది. పట్టణ స్థానిక సంస్థల హక్కులను పూర్తిగా హరించివేస్తున్నది.

> మంచినీరు, పారిశుధ్యం, భూగర్భ మురుగునీటి సదుపాయం, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, రోడ్లు, వీధిలైట్లు, పార్కులు వంటి అనేక మౌలిక సదుపాయాలు, పౌర సేవల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను నగర, పట్టణ కౌన్సిళ్లు మాత్రమే చూస్తున్నాయి. మొదటిసారిగా కూటమి ప్రభుత్వం ఈ మౌలిక సదుపాయాలను మున్సిపల్ సంస్థల అధీనం నుండి తొలగించి ఏకపక్షంగా బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టే ప్రమాదకర విధానానికి తెరలేపింది. ఇది ప్రభుత్వ ప్రైవేట్ ప్రభుత్వ భాగస్వామ్యం (పిపిపి) వంటిదే. వేరువేరు పేర్లు తప్ప చామ్, పిపిపి మధ్య ఎలాంటి తేడా లేదు. రెండూ కూడా ప్రభుత్వ నిధులతో, ప్రజా వనరులను ఉపయోగించుకొని ప్రజలను, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టే ప్రైవేట్ కార్పొరేట్ విధానాలే.

రాష్ట్ర ప్రభుత్వం మరో దుష్ట పన్నాగం కూడా పన్నింది. అమృత్ పథకం కింద చేపట్టే మంచినీటి, మురుగునీటి ప్రాజెక్టులను పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు ఇస్తే ప్రాజెక్ట్ వ్యయంలో 40 శాతం కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల వయబులిటీ గ్యాప్ నిధి కింద వడ్డీ లేని రుణాన్ని ఇస్తానని రాష్ట్రాలకు ఎరేసింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ప్రాజెక్టుల వ్యయం రూ.10,319 కోట్లలో 40 శాతం వయబులిటి గ్యాప్ నిధి కింద వడ్డీ లేని రుణం కేంద్రం నుండి పొందటానికి తహతహలాడుతున్నది. ఇందుకు పట్టణ ప్రజల ప్రయోజనాలను బలి తీసుకుంటున్నది.

స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుండి నేటి వరకు మన రాష్ట్రంలో మున్సిపల్ నగర, పట్టణ వ్యవస్థలో చామ్ పద్ధతి అనేది లేదు. మంచినీరు, పారిశుధ్యం, భూగర్భ మురుగునీటి సదుపాయం, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, రోడ్లు, వీధిలైట్లు, పార్కులు వంటి అనేక మౌలిక సదుపాయాలు, పౌర సేవల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను నగర, పట్టణ కౌన్సిళ్లు మాత్రమే చూస్తున్నాయి. మొదటిసారిగా కూటమి ప్రభుత్వం ఈ మౌలిక సదుపాయాలను మున్సిపల్ సంస్థల అధీనం నుండి తొలగించి ఏకపక్షంగా బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టే ప్రమాదకర విధానానికి తెరలేపింది. ఇది ప్రభుత్వ ప్రైవేట్ ప్రభుత్వ భాగస్వామ్యం (పిపిపి) వంటిదే. వేరువేరు పేర్లు తప్ప చామ్, పిపిపి మధ్య ఎలాంటి తేడా లేదు. రెండూ కూడా ప్రభుత్వ నిధులతో, ప్రజా వనరులను ఉపయోగించుకొని ప్రజలను, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టే ప్రైవేట్ కార్పొరేట్ విధానాలే.

అమృత్ పథకంలో ఇచ్చే నిధులన్నీ సంస్కరణలతో ముడిపెట్టి ఇచ్చేవే. తప్పనిసరిగా పట్టణ రంగంలో 11 రకాల సంస్కరణలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలి. ప్రభుత్వం పౌరసేవల బాధ్యత నుండి క్రమేణా వైదొలగి ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేయాలి.

రాష్ట్ర కూటమి ప్రభుత్వం అమృత్ పథకం షరతులను పూర్తి స్థాయిలో అమలుకు పూనుకుంది. ఈ పథకం ప్రారంభంలోనే అనగా 2015 లోనే చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడే అమృత్ పథకం అమలుకు కేంద్రంతో ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నీటి చార్జీలు పెంచుతూ 2018లో జీవో నెంబర్ 159ని విడుదల చేశారు. నెలవారీ నీటి చార్జీలే కాకుండా కొళాయి కనెక్షన్ డొనేషన్లు కూడా భారీగా పెంచింది. మురుగునీటి కనెక్షన్‌పై చార్జీలు విధించారు. అలాగే రాష్ట్ర నూతన నీటి చార్జీల విధాన పత్రాన్ని విడుదల చేసింది. ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత రావడం, 2019లో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ జీవోను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం ఆ జీవో అమలుకు పూనుకోలేదు.

ఇప్పుడు తిరిగి ఆ జీవో అమలు లేదా అలాంటి మరో కొత్త జీవో విడుదల చేయనున్నారు. ఎందుకంటే అమృత్ నిధులు పొందాలంటే నీటి చార్జీలు, మురుగు నీటి చార్జీలు పెంచటం, కనీసం మంచి నీరు, మురుగు నీరు నిర్వహణకు అయ్యే ఖర్చును పూర్తిగా వినియోగదారుల నుండి రాబట్టడం, వాటి నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పటం వంటివి రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా చేయాలి. ఇప్పటి వరకు మంచి నీటి చార్జీలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్ సంస్థల్లో ఒకే విధంగా లేవు. మున్సిపల్, నగరపాలక సంస్థలు నీటి కనెక్షన్ డిపాజిట్ల రేట్లు నిర్ణయించుకుంటున్నాయి. నీటి చార్జీలు పెంచాలని భావిస్తే ముందుగా మున్సిపల్ కౌన్సిల్లో చర్చించి నిర్ణయించిన రేట్ల ముసాయిదాను అభిప్రాయాలు, అభ్యంతరాల కోసం ప్రజల ముందుంచుతారు. ప్రజల అభ్యంతరాల అనంతరం తిరిగి మున్సిపల్ కౌన్సిల్లో చర్చించి చివరిగా చార్జీల పెంపుపై నిర్ణయం చేస్తారు. తరువాత జిల్లా గెజిట్లో ప్రచురిస్తారు. ఈ విధానం అమృత్ పథకంలో ఉన్న రాష్ట్రాలు కొనసాగటానికి వీలు ఉండదు. ఇప్పుడు దీనిని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తుంది.

గతంలోనే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నీటి చార్జీలు, మురుగు నీటి చార్జీల పెంపు అధికారాన్ని స్థానిక పట్టణ సంస్థల నుండి విడగొట్టి రాష్ట్ర చీఫ్ ఇంజనీర్‌కి బదిలీ చేశారు. ఇందుకు అనుగుణంగా మున్సిపల్ చట్టంలో కూడా సవరణలు చేయటానికి ప్రయత్నం చేశారు. ఇప్పుడు ఆ సవరణలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కాబోతున్నది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు తమ పరిధిలో మంచి నీటి, మురుగు నీటి చార్జీలను నిర్ణయించుకునే రాజ్యాంగం కల్పించిన హక్కును కూడా కోల్పోనున్నాయి.

భారతదేశంలో పట్టణ వ్యవస్థలో మంచినీటి సంస్కరణలు 2002 లోనే ప్రారంభమైనాయి. అప్పటి ప్రధాని వాజ్‌పేయి ప్రభుత్వం వీటికి బీజం వేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ ఆధునీకరణ పథకాన్ని (జె.ఎన్.యు.ఆర్.ఎం)ను 2005లో ప్రారంభించింది. దేశవ్యాప్తంగా పట్టణ రంగంలో వేగంగా ప్రపంచ బ్యాంకు సంస్కరణలు అమలు చేయాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించింది. 2012 వరకు ఈ పథకాన్ని అమలు జరిపింది. మంచి నీటి రంగంలో తీవ్ర మార్పులు తీసుకురావాలని ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. వామపక్షాలతో పాటు అనేక ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ సంస్కరణల అమలును వ్యతిరేకించాయి. ప్రజల నుండి కూడా వ్యతిరేకత వ్యక్తం అయింది. ఫలితంగా నీటి సంస్కరణలును కాంగ్రెస్ పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయింది. కేంద్రంలో 2014లో తిరిగి బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణాల మౌలిక సదుపాయాల అభివృద్ధి పేర రెండు పథకాలను ప్రవేశపెట్టింది. మొదటిది స్మార్ట్ సిటీలు. రెండోది అమృత్ పథకం.

ఈ రెండు పథకాల ముఖ్య లక్ష్యం పట్టణ రంగంలోని మున్సిపల్ సేవలు అన్నిటిని ప్రైవేటీకరించటమే. స్థూలంగా ఇవి ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలే. కేంద్ర బిజెపి తో లొంగిపోయి వీటిని అమలు చేయడానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. ఈ విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టటమే రాష్ట్ర పట్టణ ప్రజల ముందున్న కర్తవ్యం.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

చారిత్రాత్మక అడుగు!

గాజా శాంతి ఒప్పందంపై భద్రతా మండలిలో భారత్

జెనీవా : ఇటీవల అమల్లోకి వచ్చిన గాజా శాంతి ఒప్పందాన్ని మధ్యప్రాచ్యంలో సుస్థిరతకు ఒక చారిత్రాత్మకమైన ముందడుగు' గా భారతదేశం అభివర్ణించింది. ఇజ్రాయిల్, పాలస్తీనా మధ్య శాశ్వత శాంతిని సాధించడానికి రెండు దేశాల ఏర్పాటు ఒక్కటే ఏకైక ఆచరణాత్మక మార్గమని పునరుద్ఘాటించింది. మధ్యప్రాచ్యంలో పరిస్థితిపై గురువారం ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో జరిగిన త్రైమాసిక బహిరంగ చర్చలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీష్ మాట్లాడారు. 'సుస్థిరమైన, శాంతియుతమైన పశ్చిమాసియా అన్న దార్శనికతను సాకారం చేసుకోవాలని భారత్ ఆకాంక్షిస్తోంది. సౌకర్యాల లేమి, అగౌరవం మన రోజువారీ జీవితంలో భాగం కాకూడదు. సంఘర్షణల కారణంగా పౌరులు మరణించకూడదు" అని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు భారతదేశం పూర్తి స్థాయిలో సహకరించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. షర్మ్ ఎల్-షేక్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ఏర్పడిన సానుకూల వాతావరణమైన చర్య ఈ ప్రాంతంలో శాశ్వత శాంతికి దారి తీస్తుందని భారత్ ఆశిస్తోందని అన్నారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌ను విలీనం చేసుకునేందుకు ఉద్దేశించిన బిల్లును బుధవారం ఇజ్రాయిల్ పార్లమెంట్ ఆమోదించడంపై కూడా ఆయన స్పందించారు. ఇజ్రాయిల్ చేపడుతున్న ఏకపక్ష చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కొనసాగుతున్న శాంతి ప్రయత్నాలను అడ్డుకోకుండా, రెండు దేశాల ఏర్పాటుకు అన్ని దేశాలు మద్దతు ప్రకటించాల్సిన సమయమిదని అన్నారు.

హంద్రీనీవా పనులు అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి-గుడిబండ

సత్యసాయి జిల్లా గుడిబండ మండలంలో జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను శుక్రవారం హెచ్.గొల్లహట్టి గ్రామానికి చెందిన పలువురు భూ నిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. నష్టపరిహారం ఇచ్చేంత వరకూ పనులను జరగనివ్వబోమని తేల్చి చెప్పారు. వివరాలు... మండలంలోని కలికెర పంచాయతీ హెచ్.గొల్లహట్టి గ్రామానికి చెందిన రైతులు చిత్తయ్య, కరియప్ప, శివన్న, రాజుకు సంబంధించిన సర్వే నెంబర్ 413లో 6.13 ఎకరాల భూమిని ప్రభుత్వం హంద్రీనీవా కాలువ కోసం తీసుకొంటున్నారు. అయితే దీనికి సంబంధించిన పరిహారం రైతులకు ఇంతవరకూ అందలేదు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదని, కావున పరిహారం ఇచ్చేంత వరకు కాలువ పనులు చేయరాదని అడ్డుకున్నట్లు తెలిపారు. పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి హంద్రీనీవా కాలువకు భూములు ఇచ్చి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

దీపావళి కాలుష్యంపై జోక్యం చేసుకోండి

- ఎన్‌హెచ్‌ఆర్‌సిని ఆశ్రయించిన ముంబయి న్యాయవాది

ముంబయి : దీపావళి సందర్భంగా భారీ ఎత్తున విచక్షణా రహితంగా బాణసంచా కాల్చడం వల్ల ప్రజారోగ్యం, పర్యావరణం, జంతువులకు తీవ్ర నష్టం జరుగుతోందని, దీన్ని పరిష్కరించడానికి తక్షణ జోక్యం చేసుకోవాలని ముంబయికి చెందిన న్యాయవాది హితేంద్ర గాంధీ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి)ను ఆశ్రయించారు. 'సంతోషంగా ఉండే హక్కు భద్రత, గౌరవంగా జీవించే హక్కును అధిగమించకూడదు. కార్బైడ్ బాణసంచా ఇప్పుడు చట్టం మాత్రమే కాదు. జీవితానికి సంబంధించిన విషయం' అని పిటిషన్‌లో గాంధీ తెలిపారు. ప్రమాదకరమైన కార్బైడ్ బాణసంచా తయారీ, వినియోగాన్ని నియంత్రణ చర్యలను సిఫారసు చేస్తూ జాతీయ స్థాయిలో అధ్యయనాన్ని ప్రారంభించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సిని అభ్యర్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, స్వతంత్ర సంస్థల నివేదికల ప్రకారం దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో దీపావళి రాత్రి వాయుకాలుష్యం తీవ్రంగా పెరిగిందని, శ్వాసకోశ వ్యాధుల కారణంగా ఆసుపత్రుల్లో చేరిన వారి సంఖ్య బాగా పెరిగిందని పిటిషన్ తెలిపింది. నివాసాల్లోనే తయారు చేస్తున్న 'కార్బైడ్ తుపాకులు' భద్రతా ప్రమాణాలకు దూరంగా ఉంటున్నాయని, మార్కెట్లో విస్తృతంగా లభ్యమవుతున్నాయని పిటిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. కార్బైడ్ ఆధారిత బాణసంచా తయారీ, వినియోగంపై దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని పిటిషన్ కోరింది. బాణసంచాతో వందలాది జంతువులు గాయపడ్డాయని, చెట్లు - నీటి వనరులు రసాయన అవశేషాలు, చెత్తతో నిండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వచ్చే ఏడాది మార్చిలో థాయ్‌లాండ్ సార్వత్రిక ఎన్నికలు


ప్రధాని అనుతిన్ చార్న్ విరాకుల

బ్యాంకాక్ : వచ్చే ఏడాది మార్చిలో థాయిలాండ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగవచ్చని సీనియర్ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. ప్రధాని అనుతిన్ చార్న్ విరాకుల్, ఎన్నికల కమిషన్‌తో ఈ అంశంపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణ, కాలపరిమితి గురించి చర్చించాయని ప్రధాని కార్యాలయానికి అనుబంధంగా ఉన్న మంత్రి పరడోర్న్ ప్రిస్సాననంతకుల్ తెలిపారు. మార్చి 29న ఎన్నికలు ఉండవచ్చని, ఎన్నికల షెడ్యూల్‌ను కమిషన్ నిర్ణయించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. కొత్త రాజ్యాంగంపై ప్రజాభిప్రాయ సేకరణతో పాటు కంబోడియాతో సరిహద్దు విభజనకు సంబంధించి రెండు ఒప్పందాలను రద్దు చేయాలా, వద్దా అని నిర్ణయించేందుకు సాధారణ ఎన్నికలతోపాటు మరో ప్రజాభిప్రాయ సేకరణ జరిగే అవకాశం ఉందని తెలిపారు.

నూతన ఐటి రూల్స్‌పై ఆందోళనలు

- ఉన్నతస్థాయి ప్రభుత్వ లేదా పోలీసు ఆఫీసర్లకు అధికారాలు
- సోషల్ మీడియా కంటెంట్ తొలగింపు ఆదేశాలు వారి చేతుల్లోనే
- నవంబర్ 15 నుంచి అమల్లోకి
- డిజిటల్ హక్కుల కార్యకర్తలు, న్యాయ నిపుణుల నుంచి విమర్శలు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రూల్స్‌లో మార్పులు చేసింది. ఇటీవలే కొత్త నిబంధనలను నోటిఫై చేసింది. దీంతో ఇప్పుడు సోషల్ మీడియాలో లేదా ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలోని కంటెంట్‌ను తొలగించాలంటూ ఆదేశాలివ్వడానికి కేవలం ఉన్నతస్థాయి ప్రభుత్వ లేదా పోలీసు అధికారులు మాత్రమే అర్హులు. కొత్త నిబంధనల ప్రకారం.. ప్రభుత్వ అధికారుల్లో జాయింట్ సెక్రెటరీ లేదా అంతకంటే ఉన్నత స్థాయివారు, పోలీసు అధికారుల్లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) లేదా అంతకంటే పై స్థాయి అధికారులు మాత్రమే ఆదేశాలను ఇవ్వగలవారు. ఇప్పటి వరకూ ఇంతకు ముందు కింది స్థాయి అధికారులు కూడా ఈ ఆదేశాలు ఇవ్వగలిగేవారు. దీన్ని కేంద్రం ఇప్పుడు వాటిని మరింత కఠినతరం చేయటం గమనార్హం. కేంద్రం ఈ కొత్త రూల్స్‌ను నోటిఫై చేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్ (ఐటిఆర్)లోని నిబంధన 3(1)(డి) సవరణ అనంతరం ఈ కొత్త రూల్స్ నవంబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఆదేశాలు ఏ విధంగా ఉండాలి?

ఈ ఆదేశాలు తప్పనిసరిగా రాతపూర్వకంగా ఉండాలి. ఏ చట్టం లేదా నిబంధన ఆధారంగా ఆ కంటెంట్ తొలగించాలి, అది ఏ విధమైన తప్పుడు కంటెంట్ (ఉదాహరణకు : ద్వేషపూరిత వ్యాఖ్యలు, అబద్ధ సమాచారం మొదలైనవి), ఏ యూఆర్‌ఎల్ లేదా లింక్‌ను తొలగించాలన్న వివరాలు ఆ ఆదేశాల్లో స్పష్టంగా ఉండాలి. ప్రతి నెలా, ఆ ఆదేశాలు ఇచ్చిన శాఖలోని ఒక సెక్రెటరీ స్థాయి అధికారి ఆ ఆదేశాలను సమీక్షించాలి.

ప్రభుత్వ వాదన

అయితే ఈ మార్పులు ఒక స్పష్టతను, జవాబుదారీతనాన్ని, సముచితతను తీసుకొస్తాయని ప్రభుత్వం చెప్తున్నది. కేవలం పెద్ద స్థాయి బాధ్యత కలిగిన అధికారులు మాత్రమే ఇలాంటి నిర్ణయాలు (సోషల్ మీడియా కంటెంట్ కట్టడికి సంబంధించి) తీసుకోగలుగుతారని అంటున్నది. డీప్‌ఫేక్ వీడియోలు, ఫేక్‌న్యూస్, ఆన్‌లైన్ మోసాలు వంటి సమస్యలను అరికట్టడంలో తాజా మార్పులు సహాయపడుతాయని ప్రభుత్వం చెప్తున్నది. ప్రపంచవ్యాప్తంగా డీప్‌ఫేక్ వీడియోలు, ఫొటోలు, ఆడియోలు పెరుగుతున్నాయనీ, వీటిని కట్టడి చేసేందుకే తాజా మార్పులని కేంద్రం చెప్తున్నది. వీటిని ఉపయోగించి ప్రైవసీ ఉల్లంఘన, తప్పుడు రాజకీయ లేదా వార్తల ప్రచారం, మోసం చేస్తూ జరుగుతోన్న డబ్బు దోపిడీకి అడ్డుకట్ట వేయొచ్చని వాదిస్తున్నది.

మార్పులపై మేధావుల ఆందోళనలు

డిజిటల్ హక్కుల కార్యకర్తలు, న్యాయ నిపుణులు, విమర్శకుల వాదన మాత్రం ఇంకోలా ఉన్నది. ఈ విధానం అస్పష్టంగా ఉన్నదనీ, దుర్వినియోగానికి అవకాశం ఉన్నదని వారు అంటున్నారు. ప్రజలతో, సంబంధిత వర్గాలను సంప్రదించకుండా ఈ సవరణలు చేశారని వారు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాలను సమీక్షించేవారు కూడా అదే శాఖలోని అధికారులు కావడం వలన స్వతంత్ర పర్యవేక్షణ ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన గురించి వార్తలు, వీడియోలను తొలగించడానికి రైల్వే అధికారులు సహయోగ్ పోర్టల్‌ను దుర్వినియోగం చేశారని వారు ఉదహరిస్తున్నారు. ఈ మార్పులు 'సహయోగ్ పోర్టల్'ను మరింత బలపరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏమిటీ ఈ సహయోగ్ పోర్టల్?

సహయోగ్ పోర్టల్ అనేది భారత ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం. దీని ద్వారా ప్రభుత్వ శాఖలు, పోలీస్ శాఖలు లేదా ఇతర అధికార సంస్థలు సోషల్ మీడియా లేదా వెబ్‌సైట్లలోని కంటెంట్‌ను తొలగించాలని ఆదేశాలు పంపగలవు. ఏదైనా శాఖ లేదా అధికారి ఒక పోస్ట్ లేదా వెబ్‌పేజ్ చట్టవిరుద్ధమని భావిస్తే.. వారు సహయోగ్ పోర్టల్ ద్వారా ఆ కంటెంట్ గురించి వివరాలు నమోదు చేస్తారు. ఆ ఆదేశం నేరుగా సోషల్ మీడియా కంపెనీలకు వెళ్తుంది. ఆ కంపెనీలు ఆ కంటెంట్‌ను తొలగించటం, చర్యలు తీసుకోవటం వంటివి చేయాలి. అయితే ఈ సహయోగ్ పోర్టల్‌పై చాలా విమర్శలు ఉన్నాయి. ఇది ప్రభుత్వానికి ఎక్కువ అధికారాన్ని ఇస్తుందనీ, పారదర్శకత లేకుండా కంటెంట్ తొలగించడానికి ఉపయోగపడుతుందనీ, స్వేచ్ఛా భావవ్యక్తీకరణకు ముప్పు తెస్తోందని ఆరోపణలు ఉన్నాయి. ఎక్స్ ఈ పోర్టల్‌పై కర్నాటక హైకోర్టులో కేసు వేసింది. అది తమ స్వేచ్ఛను, పారదర్శకతను ఉల్లంఘిస్తుందని వాదించింది. కానీ హైకోర్టు సదరు పిటిషన్‌ను తిరస్కరించింది. ఇప్పుడు ఎక్స్ కంపెనీ సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నది.

రాష్ట్రస్థాయి వాలిబాల్ పోటీలకు ఎంపికైన గిరిజన విద్యార్థి



ప్రజాశక్తి-ఆలూరు(కర్నూలు)

ఎస్‌జిఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆలూరు గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని పి.ఐషమ్మ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కె. రేఖమణి శుక్రవారం విలేకరులకు తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని పి.ఐషమ్మ క్రీడల పట్ల ఎంతో ఆసక్తి. తాను పట్టుదలతో వాలీబాల్ క్రీడల్లో మండల, జిల్లాస్థాయిలో రాణించి ఈనెల 23న కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడంతో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని రేఖమణి విలేకరులకు చెప్పారు. అక్టోబర్ 27 నుండి 30 వరకు పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో విద్యార్థి పి.ఐషమ్మ పాల్గొననున్నారు. మారుమూల గ్రామం నుండి ఐషమ్మ ఎంపిక కావడం సంతోషం. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఆలూరు గ్రామానికి మంచి పేరు ప్రాఖ్యాతలు తీసుకురావాలని.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంపికయ్యేలా ఆడాలని ప్రిన్సిపల్ రేఖమణి ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థులను క్రీడా నైపుణ్యంతో ప్రోత్సహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు క్రిష్ణ, ప్రతాప్, ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపల్ అభినంధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది రాజేంద్ర, మల్లికార్జున, మల్లీశ్వరి, లిఖిత, సుగుణ, రంగమ్మ, సంగీత, మెర్రి ఫ్లోరెన్సీ, రమాదేవి, విజయ కుమారి పరమేష్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల సంక్షోభానికి జగనే కారణం

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ నూతన వైద్య కళాశాలల సంక్షోభానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కారణమని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన జగన్ ఆ మేరకు తగు చర్యలు చేపట్టకపోవడం వల్లే సంక్షోభం ఏర్పడిందన్నారు. సచివాలయంలో శుక్రవారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతుందంటూ జగన్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఆ ఆరోపణలపై నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కమిటీని ఏర్పాటు చేసేందుకు ఇద్దరు లేదా ముగ్గురు నిపుణులను త్వరగా సూచించాలని జగన్‌ను కోరారు. జగన్ మానసిక స్థితి తీరు ఆందోళనకరమని విమర్శించారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) ఆస్పత్రులు ప్రభుత్వ బకాయిలు వల్ల సమస్యలు ఎదుర్కొనడం వాస్తవమని మంత్రి చెప్పారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం మార్గాలను అన్వేషిస్తున్నామని, అందులో భాగంగా ప్రత్యామ్నాయ విధానంపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎపి వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ మూడో దశ అడ్మిషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిగ్రీ అడ్మిషన్ల మూడో దశ ప్రక్రియ శనివారం ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను డిగ్రీ అడ్మిషన్ల కన్వీనర్, ఉన్నత విద్యామండలి జాయింట్ డైరెక్టర్ టివి కృష్ణమూర్తి శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల 25, 26 తేదీల్లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని, సర్టిఫికెట్ల పరిశీలన 25 నుంచి 27వ తేదీ వరకు జరగనున్నట్లు వెల్లడించారు. వెబ్ ఆప్షన్ల ఎంపిక 28, 29 తేదీల్లో, ఆప్షన్లు మార్చుకునే అవకాశం 30వ తేదీన ఉంటుందని తెలిపారు. నవంబరు ఒకటో తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని, విద్యార్థులు 4వ తేదీలోపు సీట్లు పొందిన కళాశాలల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

చట్ట వ్యతిరేకంగా రాజీపై టిటిడి చర్యలు

ప్రజాశక్తి-అమరావతి

టిటిడిలో గతంలోని అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ సతీష్ కుమార్, పరకామణిలో చోరీ ఆరోపణల నిందితుడు రవికుమార్ లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం విచారించింది. టిటిడి బోర్డు పర్మిషన్ లేకుండా కేసును రాజీ చేసుకున్నారని టిటిడి ఎగ్జిక్యూటీవ్ అధికారి అనీల్ కుమార్ సింఘాల్ నివేదించారు. 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేసుకొనేనాటికి సతీష్ కుమార్ పరకామణి అధికారిగా లేరన్నారు. ఏ అర్హత లేకుండానే కేసును రాజీ చేసుకున్నారని చెప్పారు. సతీష్ కుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని టిటిడి చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి గత అక్టోబర్ 17న డిజిపికి నివేదిక ఇచ్చారన్నారు. 2023లో పరకామణిలో జరిగిన కుంభకోణంపై సిఐడితో దర్యాప్తు జరిపించాలన్న వినతిపత్రంపై చర్యలు తీసుకోలేదని, ఇరువురూ లోక్ అదాలత్‌లో కేసు రాజీ అన్యాయమని పేర్కొంటూ జర్నలిస్ట్ ఎం శ్రీనివాసులు వేసిన పిటిషన్‌లో టిటిడి ఇఒ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. చోరీ కేసులో నిందితుడు సివి రవికుమార్ టిటిడి రెగ్యులర్ ఉద్యోగి కాదన్నారు. పెద్ద జీయంగార్ మఠంలో చేస్తారని, పరకామణిలో గుమస్తాగా నియమిస్తూ జీయంగార్ 1985 ప్రొసీడింగ్స్ ఇచ్చారని వివరించారు.

ముప్పిడి అవినాష్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు : సిట్

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కేసులో నిందితుడు రాజ్ కసిరెడ్డితో కలిసి పిటిషనర్ ముప్పిడి అవినాష్‌రెడ్డి పలుసార్లు సమావేశమయ్యారని సిట్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టుకు చెప్పారు. ఏ రాష్ట్రంలో వినియోగంలో లేని మద్యం బ్రాండ్లను గత ప్రభుత్వంలో వాడుకలోకి వచ్చాయన్నారు. అవినాష్‌రెడ్డి వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేయాలని శుక్రవారం జరిగిన విచారణ సమయంలో చెప్పారు. పిటిషనర్ విదేశాలకు పారిపోయారని, కాబట్టి అరెస్టుకు ఆస్కారం కూడా లేదని, పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. మద్యం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కేసులో నిందితుడు ముప్పిడి అవినాష్ రెడ్డి వేసిన పిటిషన్‌పై ఈ నెల 31న తదుపరి విచారణ చేస్తామని జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ప్రకటించారు.

ఉపాధి చూపరు.. భృతి ఇవ్వరు..!

- నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరం
- ఏలూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో 45,397 మంది నమోదు
- వర్క్‌ఫ్రం హోమ్ కల్పిస్తామని చేసిన సర్వే ఏమైందో..?



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులను అన్నివిధాలా ఆదుకుంటామని కూటమి ఎన్నికల్లో నమ్మబలికింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటి వరకూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏమాత్రం కల్పించని పరిస్థితి నెలకొంది. ఉద్యోగాలు కల్పించకపోతే నెలకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ సైతం అమలు కాలేదు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు హామీల వర్షం కురిపించింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అప్పటి వరకూ నిరుద్యోగ భృతి అందిస్తామని మేనిఫెస్టోలో సైతం పెట్టింది. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడిన పరిస్థితి లేదు. ఏలూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో 2025 సెప్టెంబర్ నాటికి 45,397 మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో 31,280 మంది పురుషులు ఉండగా, 14,117 మంది మహిళలు ఉన్నారు. ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకోని వారి సంఖ్య వేలల్లోనే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ నిర్వహించిన జాబ్‌మేళాల్లో 930 మంది ప్రయివేటు సంస్థలకు ఎంపికైనట్లు ఉపాధి కార్యాలయ లెక్కలు చెబుతున్నాయి. ఏడాదిన్నర గడిచినా పట్టుమని వెయ్యి మందికి కూడా ఉద్యోగాలు కల్పించని పరిస్థితి ఉంది. జిల్లాలో కొత్తగా వచ్చిన పరిశ్రమలుసైతం పెద్దగా లేకుండాపోయాయి. దీంతో నిరుద్యోగుల పరిస్థితి అయోమయంగా మారింది. ఉద్యోగాలు కల్పించే వరకూ నిరుద్యోగులకు నెలకు రూ.మూడు వేల చొప్పున భృతి అందిస్తామని కూటమి సర్కార్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచింది. ఇప్పటి వరకూ దీనిపై ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాల్లేవు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని నిరుద్యోగుల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం నిరుద్యోగులకు నెలకు రూ.రెండు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. ఐదేళ్లపాటు అమలు చేయకుండా ఎన్నికలకు మూడు నెలల ముందు నిరుద్యోగ భృతి పేరుతో హడావుడి చేసింది. యువతలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో 2019 ఎన్నికల్లో టిడిపి ఘోర పరాజయం పాలైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలకు కేవలం రెండుచోట్ల మాత్రమే గెలిచింది. నరసాపురం, ఏలూరు ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది. నిరుద్యోగ భృతి ఈసారీ సక్రమంగా అమలు చేయపోతే కూటమి సర్కార్ అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెప్పొచ్చు.

వర్క్‌ఫ్రం హోమ్ సర్వే ఏమైనట్టు..?

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వం వివిధ రకాల సర్వేలు చేయించింది. అందులో నిరుద్యోగులకు సంబంధించిన సర్వే అత్యంత ముఖ్యమైనదని చెప్పొచ్చు. ఇంటి వద్దనే ఉంటూ వర్క్‌ఫ్రం హోమ్ చేయాలనుకునే వారి డేటాను సచివాలయ ఉద్యోగులు సేకరించారు. వర్క్‌ఫ్రం హోమ్ కోసం ముందుకొచ్చిన నిరుద్యోగుల నుంచి సర్టిఫికెట్లు సైతం తీసుకుని అప్‌లోడ్ చేశారు. ఇప్పటి వరకూ అందుకు సంబంధించిన ఎటువంటి సమాచారమూ అభ్యర్థులకు లేకుండా పోయింది. సచివాలయ ఉద్యోగుల వద్దకు వెళ్తే తమకు ఏమీ తెలియదని, సర్వే చేసి, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయడం వరకు మాత్రమే తమ పని అని చెబుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్ పేరుతో చేసిన సర్వే ఏమైందో ఏఒక్కరూ సమాధానం చెప్పడం లేదు. దీంతో వర్క్‌ఫ్రం హోమ్ కోసం ముందుకొచ్చిన ఎంతోమంది మహిళా నిరుద్యోగులు తీవ్ర నిరాశలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన స్పందన లేకుండాపోయింది. దీంతో నిరుద్యోగ యువతలో ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

పంచలోహ విగ్రహాల చోరీ నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - నరసన్నపేట

నరసన్నపేట పట్టణంలోని సిద్ధాశ్రమంలో పంచలోహ విగ్రహాలు, ఇతర వస్తువుల దొంగతనం కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడు నరసన్నపేట పట్టణంలోని హడ్కోకాలనీకి చెందిన దుంపల సింహాచలం నుంచి రూ.1.40 లక్షల విలువ గల వస్తువులను రికవరీ చేసినట్లు చెప్పారు. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి కేసు వివరాలను వెల్లడించారు. నరసన్నపేట ఇందిరానగర్ కాలనీలోని సిద్ధాశ్రమంలో ఈనెల 18వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి చొరబడి ఆరు పంచలోహ విగ్రహాలు, ఒక గంట, ఇత్తడి పల్లెం దొంగిలించినట్లు సిద్ధాశ్రమ కార్యదర్శి ముద్దాడ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈనెల 24న నరసన్నపేట ఎస్‌ఐ శంకరరావు మండలంలోని తామరాపల్లి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా, గోనె సంచితో వస్తున్న యువకుడు పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. విచారణలో హడ్కో కాలనీకి చెందిన దుంపల సింహాచలంగా గుర్తించామన్నారు. నిందితుడు చోరీని అంగీకరించినట్లు తెలిపారు. నిందితునిపై గతంలో మూడు కేసులు నమోదయ్యాయన్నారు. సమావేశంలో టెక్కలి డిఎస్‌పి డి.లక్ష్మణరావు, సిఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌ఐ శంకరరావు పాల్గొన్నారు.

సంస్కరణలు తేకపోతే ఐక్యరాజ్య సమితి అస్తిత్వానికే ముప్పు!

- 80వ వార్షికోత్సవంలో జైశంకర్
- బాధితులను, ఉగ్రవాదులను ఒకే గాటన ఎలా కడతారని ప్రశ్న

న్యూఢిల్లీ : అత్యవసరంగా సంస్కరణలు తీసుకురాకపోతే ఐక్యరాజ్య సమితి పనితీరు స్తంభించిపోతుందని విదేశాంగ మంత్రి జైశంకర్ విమర్శించారు. పహల్గాం ఉగ్ర దాడికి బాధ్యులైన ఉగ్రవాద సంస్థను భద్రతా మండలిలో వెనకేసుకు వచ్చేందుకు పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాలను ఉటంకిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్య సమితి 80వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ వ్యూహం పేరుతో బాధితులను, ఉగ్రవాదానికి పాల్పడుతున్న వారిని ఒకే గాటన కట్టడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఐక్యరాజ్య సమితి తీరు బాగా లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. యుఎన్‌లో జరిగే చర్చలు రాన్రాను ఏకపక్షంగా మారిపోతున్నాయన్నారు. మొత్తంగా దాని పనితీరును పరిశీలిస్తే స్పష్టంగా ప్రతిస్తంభనకు గురైనట్లు కనిపిస్తోందన్నారు. సంస్కరణల ప్రక్రియను ఉపయోగించే ఏ అర్థవంతమైన సంస్కరణనైనా అడ్డుకుంటారని అన్నారు. ఐక్యరాజ్య సమితిని తిరిగి కొత్తగా నిర్వచించడం ప్రపంచ దేశాల ముందున్న పెను సవాలని అన్నారు. భద్రతా మండలి సభ్యులే బహిరంగంగా పహల్గాం వంటి పాశవిక ఉగ్ర దాడికి బాధ్యులైన సంస్థను కాపాడుతోందని, ఇక బహుళవాదానికి విశ్వసనీయత ఎక్కడుందని ఆయన ప్రశ్నించారు. పాకిస్తాన్ పేరును జై శంకర్ ప్రస్తావించకుండానే ఆ దేశాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. టెర్రరిస్టులమని ప్రకటించుకున్న వారిని ఆంక్షల ప్రక్రియ నుండి కాపాడుతున్నపుడు ఇక బాధ్యత గల స్థానాల్లో కూర్చున్నవారి నిజాయితీ ఏమిటో అర్థమవుతోందన్నారు. పాకిస్తాన్ ప్రస్తుతం భద్రతా మండలి సభ్య దేశంగా వుంది. జులై మాసానికి అధ్యక్ష స్థానంలో బాధ్యత వహించింది.

హాకీ జూనియర్ వరల్డ్‌కప్‌కు పాకిస్తాన్ దూరం

లాహోర్: భారత్ వేదికగా నవంబర్ 28 నుంచి జరగాల్సిన పురుషుల జూనియర్ హాకీ వరల్డ్‌కప్ నుంచి పాకిస్తాన్ తప్పుకుంటున్నట్లు పాకిస్తాన్ హాకీ ఫెడరేషన్ ప్రకటించింది. భారత్‌తో సత్సంబంధాలు లేని కారణంగా ఈ మెగా టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనతో తెలియజేసింది. ఈ ఏడాది భారత్‌లో జరగాల్సిన హాకీ టోర్నీ నుంచి తప్పుకోవడం పాకిస్తాన్‌కు ఇది రెండోసారి. ఆగస్ట్‌లో జరగాల్సిన పురుషుల ఆసియా కప్ నుంచి కూడా పాక్ ఇదే కారణంగా వైదొలిగింది. అప్పుడు పాక్ స్థానాన్ని బంగ్లాదేశ్‌తో భర్తీ చేసి టోర్నీని కొనసాగించారు. తాజాగా జూనియర్ ప్రపంచకప్ నుంచి కూడా పాక్ తప్పుకోవడంతో అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రత్యామ్నాయ జట్టును వెతికే పనిలో పడింది. టోర్నీ ప్రారంభానికి ఇంకా చాలా సమయం ఉండటంతో త్వరలో ప్రత్యామ్నాయ జట్టును ప్రకటించే అవకాశం ఉంది. పురుషుల జూనియర్ హాకీ ప్రపంచకప్ 2025 నవంబర్ 28 నుంచి డిసెంబర్ 28 వరకు భారత్‌లోని చెన్నై, మధురై నగరాల్లో జరగనుంది. భారత్, పాక్, చిలీ, స్విట్జర్లాండ్ జట్లు గ్రూప్-బిలో ఉన్నాయి. పాకిస్తాన్ హాకీ ఫెడరేషన్ కార్యదర్శి రానా ముజాహిద్ మాట్లాడుతూ.. "ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌లో మా జట్టు ఆడడం సురక్షితం కాదని భావిస్తున్నాం. ఇలాంటి భావోద్వేగ పరిస్థితుల్లో మా జట్టును పంపడం సరికాదు" అని తెలిపారు.

మైనార్టీ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

- మంత్రి ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మైనార్టీ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఓఎంసి ఎపి), ఐఐఎస్ సహకారంతో జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండేళ్ల ఐటిఐ, మూడేళ్ల ఎలక్ట్రీషియన్ ట్రేడ్ విద్యార్హత కలిగి, వయోపరిమితి గరిష్టంగా 30 ఏళ్లలోపు ఉండి, ఎలక్ట్రీషియన్ పనుల్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగాలకు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ. 2,600 నుంచి 2,700 యూరోలు (భారత కరెన్సీ ప్రకారం రూ.2.60 లక్షల నుంచి రూ.2.70 లక్షలు) పొందొచ్చన్నారు. అదనపు పనికి అదనపు జీతం, ఇతర సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. వసతి, అనువాద, స్థానిక గుర్తింపు ఖర్చులు యజమాని భరిస్తారని వెల్లడించారు. జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అర్హులైన అభ్యర్థులకు జర్మనీ భాషపై పట్టు సాధించేందుకు వీలుగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 12 నుంచి 14 వారాల పాటు శిక్షణ తరగతులను తాత్కాలికంగా రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందుకు అయ్యే ఖర్చును అభ్యర్థులే భరించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు, శిక్షణ కోసం ఫీజు రూ.1.15 లక్షలను మూడు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విమాన, వీసా ఛార్జీలు అభ్యర్థులే స్వయంగా చెల్లించాలన్నారు. ఈ ఉద్యోగాల కోసం వచ్చే నెల 2వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు 9988853335, 8712655686, 8790118349 నెంబర్లకు ఫోన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని వెల్లడించారు.

ఎన్‌టిఆర్ జీవితం స్ఫూర్తిదాయకం

- విగ్రహావిష్కరణలో మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ, సినీరంగాలకు కొత్తబాటలు వేసిన మహనీయుడు నందమూరి తారక రామారావు జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం మర్రిబంధంలోని ఎన్‌టిఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని పార్థసారధి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్‌కుమార్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం అక్కడే పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం 16 నెలల్లో రూ.లక్ష కోట్లు సంక్షేమ పథకాలకు ఖర్చు చేసిందన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహాపురుషుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. మహేష్ కుమార్, గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో ఆంధ్రరాష్ట్రానికి ఎన్‌టిఆర్ ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ప్రజాప్రతినిధులు, ఎన్‌టిఆర్ అభిమానులు, టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటినుంచి ప్రొ కబడ్డీ ప్లే-ఆఫ్స్ పోటీలు

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ సీజన్-12 లీగ్ పోటీలు ముగిసాయి. టాప్-4 స్థానాల్లో నిలిచిన జట్లతోపాటు 5 నుంచి 8 స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ప్లే-ఆఫ్స్ పోటీలు శనివారం నుంచి జరగనున్నాయి. నేడు జరిగే ప్లే-ఆఫ్స్‌లో హర్యానా స్టీలర్స్ జట్టు జైపూర్ పింక్ ప్యాంథర్స్, మరో మ్యాచ్‌లో యు ముంబతో పట్నా పైరెట్స్ తలపడనున్నాయి. నేటి పోటీలో ఓడిన జట్లు టోర్నీ నుంచి నిష్క్రమిస్తాయి. గెలిచిన జట్లు ఎలిమినేటర్-2లో 3, 4 స్థానాల్లో నిలిచిన జట్లతో తలపడాల్సి ఉంటుంది. మూడో స్థానాల్లో నిలిచిన బెంగళూరు బుల్స్‌తో తెలుగు టైటాన్స్ జట్ల మధ్య ఆదివారం మ్యాచ్ జరగనుంది. ఈ పోటీలో గెలిచిన జట్టుక్వాలిఫయర్-2లోకి ప్రవేశిస్తుంది. ఓడిన జట్టు ఎలిమినేటర్-3లో మరో మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. దాదాపు 10ఏళ్ల తర్వాత తెలుగు టైటాన్స్ జట్టు ప్లే-ఆఫ్స్‌కు చేరిన సంగతి తెలిసిందే. సోమవారం జరిగే తొలి సెమీస్‌లో టాప్-2 జట్లు పుణేరి పల్టన్స్, దబాంగ్ ఢిల్లీ జట్లు పోటీపడతాయి.

గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరనుండగా.. ఓడిన జట్టు క్వాలిఫయర్-2లో మరో మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది.

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	సో.వ్య.	పా
1. పుణేరి పల్టన్స్	18	13	5	88	26
2. దబాంగ్ ఢిల్లీ	18	13	5	38	26
3. బెంగళూరు బుల్స్	18	11	7	97	22
4. తెలుగు టైటాన్స్	18	10	8	45	20
5. హర్యానా స్టీలర్స్	18	10	8	40	20
6. యు ముంబ	18	10	8	8	20
7. పట్నా పైరెట్స్	18	8	10	10	16
8. జైపూర్ పింక్ ప్యాంథర్స్	18	8	10	-48	16
9. యుపి యోధాస్	18	7	11	-65	14
10. తమిళ్ తలైవాస్	18	6	12	-36	12
11. గుజరాత్ జెయింట్స్	18	6	12	-73	12
12. బెంగాల్ వారియర్స్	18	6	12	-104	12



140 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

టాటానగర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న 140 కేజీల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.7లక్షల వరకూ ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. స్లీపర్ బోగీలను పరిశీలించగా యజమానులు లేని 15 సంచులు లభించాయి. వాటిలో గంజాయి ప్యాకెట్లు గుర్తించారు.

రూ. 500కే ఎల్‌పిజి సిలిండర్

అవినీతి రహిత పాలన
తేజస్వి యాదవ్ హామీ



ఇండియా బ్లాక్ నాయకులతో తేజస్వియాదవ్

పాట్నా : బీహార్ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే ఎల్‌పిజి సిలిండర్ రూ.500కే ఇస్తామని ఆర్‌జెడి నాయకులు తేజస్వియాదవ్ హామీ ఇచ్చారు. వృద్ధాప్య పెన్షన్‌ను రూ.1,500కు పెంచుతామని తెలిపారు. భక్తియాపూర్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం బీహార్‌లో 20 ఏళ్ల నుంచి, కేంద్రంలో 11 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్ర తలసరి ఆదాయం అత్యల్పంగా ఉందని, రైతులు పేదలుగానే ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో నేరాలు, అవినీతి విపరీతంగా పెరిగాయన్నారు. శుక్రవారం పాట్నాలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 'నేను ముఖ్యమంత్రి అయితే.. బీహార్ ప్రజలు కూడా ముఖ్యమంత్రి అయినట్టే. బీహార్‌లో నేరాలు, అవినీతి లేకుండా చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా అవినీతి కుంభకోణాలు పెరిగిపోయాయి. ప్రధానమంత్రే స్వయంగా నితీష్‌కుమార్ చేసిన 55 కుంభకోణాల జాబితాను రూపొందించారు. దీనిపై ఏ చర్యలు తీసుకున్నారు? కుంభకోణాలు జరుగుతున్నప్పుడు, ఎటువంటి చర్య తీసుకోనప్పుడు అది జంగిల్ రాజ్‌నే. తుపాకీ కాల్పులు, హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు, కిడ్నాప్‌లు లేకుండా బీహార్‌లో ఒక్కరోజు కూడా లేదు. ప్రతిరోజూ నేరాలు జరుగుతూనే ఉన్నాయి. దేశంలో అత్యధిక నేర రేటు కలిగిన రాష్ట్రం ఉత్తరప్రదేశ్, బీహార్ రెండవది. దేశవ్యాప్తంగా క్రైమ్ రేటు కలిగిన రాష్ట్రాలు టాప్ 5 బిజెపి పాలిత రాష్ట్రాలే' అని ఆయన తెలిపారు. కేంద్ర సంస్థలను తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్‌డిఎ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. 'గుజరాత్‌లో ఫ్యాక్టరీలు స్థాపించినవారు (బిజెపి) బీహార్‌లో విజయం సాధించాలని కోరుకుంటారు. ఇదెలా సాధ్యమవుతుంది' అని తేజస్వియాదవ్ ప్రశ్నించారు.

శాంతిభద్రతలకే ప్రాధాన్యత

ఛాత్ పూజ తరువాత మహాగర్‌బంధన్ మేనిఫెస్టో

ప్రస్తుత ఎన్‌డిఎ పాలనలో క్షీణించిన శాంతిభద్రతలను మళ్లీ గాడిలో పెట్టడానికి మహాగట్‌బంధన్ మేనిఫెస్టోలో ప్రాధాన్యత ఇవ్వనుంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం.. వచ్చే వారంలో ఛాత్‌పూజ తరువాత ఈ మేనిఫెస్టోను విడుదల చేసే అవకాశం ఉంది. పోలీసులపై రాజకీయ ఒత్తిడి లేకుండా చేయడం, స్టేషన్ ఇన్‌ఛార్జీలను నియమించడానికి పారదర్శక ప్రక్రియ వంటి చర్యలను మహాగట్‌బంధన్ మేనిఫెస్టోలో పొందుపర్చనున్నారు. ప్రస్తుత ఎన్‌డిఎ పాలనను 'గూండా రాజ్'గా ప్రచారం చేయనున్నారు. ఆరోగ్యం, విద్యతో పాటు మానవ శక్తి ఎక్కువగా అవసరమయ్యే రంగాలను అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసలను అరికట్టడానికి కూడా మేనిఫెస్టోలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇబిసి రిజర్వేషన్లు 20 నుంచి 30 శాతానికి పెంచనున్నారు.

బిజెపి తిరుగుబాటు అభ్యర్థికి ప్రశాంత్ కిషోర్ మద్దతు

గోపాల్‌గంజ్ స్థానంలో బిజెపి తిరుగుబాటు అభ్యర్థి అనుప్‌కుమార్ శ్రీవాస్తవకు మద్దతు ఇస్తున్నట్లు జన్ సురాజ్ పార్టీ (జెఎస్‌పి) వ్యవస్థాపకులు ప్రశాంత్ కిషోర్ శుక్రవారం ప్రకటించారు.

ఈ స్థానం నుంచి తమ పార్టీ బరిలోకి దింపిన శశిశేఖర్ సిన్హా బిజెపి ఒత్తిడితో పోటీ నుంచి వైదొలిగారని ఆయన చెప్పారు.

ఎన్‌డిఎ అన్ని రికార్డులనూ బద్దలుకొడుతుంది

బీహార్‌లో మోడీ ఎన్నికల ప్రచారం ప్రారంభం



ఎన్‌డిఎ నాయకులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

శుక్రవారం రెండు వరస బహిరంగ సభలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీహార్‌లో తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సమస్తిపూర్, బెగుసరాయ్ సభల్లో ఆయన ప్రసంగించారు. బీహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ అన్ని రికార్డులను బద్దలుకొడుతుందని అన్నారు. 11 ఏళ్ల నుంచి కేంద్రం అందిస్తున్న సాయంతో బీహార్ అభివృద్ధి వైపు ప్రయాణం చేస్తుందని చెప్పారు. బీహార్ ఇప్పుడు పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందని తెలిపారు. బీహార్ ప్రజలకు ఇప్పుడు లాంతర్ (ఆర్‌జెడి గుర్తు) వెలుగు అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్, ఆర్‌జెడి నాయకులు అత్యంత అవినీతిపరులని, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారని మోడీ చెప్పారు. సభల్లో ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జితన్ రాయ్ మాంఝీ, ఎంపి ఉపేంద్ర కుష్వాహా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

- నవంబరు 26న రాష్ట్రపతికి మెమొరాండం
- ఎస్‌కెఎం, సిటియు పిలుపు
- లేబర్ పాలసీ, విద్యుత్ సవరణ బిల్లుల ముసాయిదాలకు నిరసన

న్యూఢిల్లీ : విద్యుత్ సవరణ బిల్లు ముసాయిదాను, కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన లేబర్ పాలసీ ముసాయిదాను వ్యతిరేకిస్తూ రైతు సంఘాల వేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), పది కేంద్ర కార్మిక సంఘాల వేదిక (సిటియు) గురువారం తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ ఆర్థిక ప్రయోజనాలకు సాగిలపడిన కేంద్ర ప్రభుత్వం ట్రంప్ సుంకాల నుండి దేశీయ రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులను రక్షించడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రభుత్వరంగ సంస్థలను, ప్రజా సేవల విభాగాలను ప్రైవేటీకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందులో భాగమే ఈ ముసాయిదాలని విమర్శించాయి. ఈ ముసాయిదాలను వ్యతిరేకిస్తూ రాష్ట్రపతికి మెమొరాండం అందజేయాలని నిర్ణయించుకున్నట్లు ఎస్‌కెఎం, సిటియు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. నవంబర్ 26న జిల్లా కలెక్టర్ల ద్వారా రాష్ట్రపతికి ఈ మెమొరాండంలు అందజేయనున్నట్లు తెలిపాయి.

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను సవాలు చేస్తూ, సమన్వయ కార్యాచరణను కొనసాగించాలని గత వారం జరిగిన సిటియు, ఎస్‌కెఎంల సంయుక్త సమావేశం నిర్ణయించినట్లు ఆ ప్రకటన తెలిపింది. సిటియు, ఎస్‌కెఎం డిమాండ్లతోపాటు అన్ని జిల్లాలు, రాష్ట్ర ప్రధాన కార్యాలయాల్లో నెలకొన్న ఉమ్మడి సమస్యలపై నవంబర్ 26 వరకు అంటే నెలరోజుల పాటు ప్రచారోద్యమం నిర్వహించాలని పేర్కొంది. ప్రతి జిల్లా నుండి రాష్ట్రపతికి ఒక మెమొరాండం పంపనున్నట్లు తెలిపింది.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష సాధింపు చర్యలు, అణచివేత చర్యలను, కార్మిక, కర్షక వ్యతిరేక చర్యలను తిప్పికొట్టేందుకు, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రచారోద్యమాలు చేపట్టడం అత్యంత అవశ్యమని సమావేశం భావించినట్లు ఎస్‌కెఎం, సిటియు పేర్కొన్నాయి. నాలుగు లేబర్ కోడ్‌ల అజెండాను ముందుకు తీసుకువెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వాలను పక్కకు నెట్టే యత్నాలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ద్వారా రైతుల భూములను లాక్కోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించాయి.



పీప్రా అసెంబ్లీ నియోజకవర్గంలోని చాకియా బ్లాక్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం అభ్యర్థి రాజ్‌మంగళ్‌ప్రసాద్

బీహార్‌లో సిపిఎం అభ్యర్థుల విస్తృత ప్రచారం

పాట్నా : బీహార్‌లో సిపిఎం అభ్యర్థులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. పీప్రా అసెంబ్లీ నియోజకవర్గంలోని చాకియా బ్లాక్‌లో సిపిఎం అభ్యర్థి రాజ్‌మంగళ్‌ప్రసాద్ విస్తృతంగా పర్యటించారు. ఓటర్లను కలిసి ఇండియా బ్లాక్ తరపున పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. మండి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో దిగిన సిపిఎం సిట్టింగ్ ఎమ్మెల్యే సత్యేంద్రయాదవ్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తమ సమస్యలపై అసెంబ్లీలోనూ, బయటా పోరాడిన ఆయనకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. హయఘాట్ అసెంబ్లీ నియోజకవర్గంలో శ్యామ్‌భారతి, విభూతిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అజయ్‌కుమార్ విస్తృతంగా ప్రచారం చేశారు.

ఎన్‌సి 3, బిజెపి 1 రాజ్యసభ స్థానాల్లో గెలుపు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో శుక్రవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో అధికార నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) మూడు స్థానాల్లో విజయం సాధించింది. ఆశ్చర్యకరంగా బిజెపి ఒక్క స్థానంలో విజయం సాధించింది. బిజెపి విజయాన్ని ఆ పార్టీ నాయకులు కూడా ఊహించలేదు. 88 మంది సభ్యులు ఉన్న జమ్మూకాశ్మీర్ అసెంబ్లీలో బిజెపికి 28 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. శుక్రవారం ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి, ఆ పార్టీ జమ్మూకాశ్మీర్ అధ్యక్షులు సత్పల్ శర్మకు 32 ఓట్లు రావడం విశేషం. క్రాస్ ఓటింగ్‌తోనే సత్పల్ శర్మ విజయం సాధించారని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విమర్శించారు. తమ ఎమ్మెల్యేలంతా తమ అభ్యర్థులకే ఓటు వేశారని తెలిపారు. బిజెపికి నాలుగు ఓట్లు అదనంగా ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. జమ్మూకాశ్మీర్‌లో 2021 ఫిబ్రవరి నుంచి నాలుగు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటికి శ్రీనగర్‌లోని అసెంబ్లీ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలకు వరకూ ఎన్నికలు నిర్వహించారు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఫలితాలను ప్రకటించారు. ఆర్టికల్ 370 రద్దు, జమ్ముకాశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతం ప్రకటించిన తరువాత జరిగిన తొలి రాజ్యసభ ఎన్నికలు కావడంతో వీటికి ప్రాధాన్యత ఏర్పడింది.

పోలీసుల లైంగిక వేధింపులతో వైద్యురాలి ఆత్మహత్య!

- ఇద్దరు అధికారుల సస్పెన్షన్
- అరచేతిపై సూసైడ్ నోట్ రాసిన డాక్టర్

ముంబయి : మహారాష్ట్రలో దారుణ ఘటన జరిగింది. ఓ ఎస్ఐ పలుమార్లు అత్యాచారం చేయడం, మరో అధికారి లైంగికంగా, భౌతికంగా వేధించడంతో ఓ మహిళా వైద్యురాలు గురువారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఉన్నతాధికారులకు లేఖ రాసినా స్పందించకపోవడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. తప్పుడు మెడికల్ రిపోర్టులు ఇవ్వాలని, బూటకపు ఫిట్‌నెస్ రిపోర్టులు ఇవ్వాలంటూ బదానె గత ఐదు నెలల్లో తనపై నాలుగుసార్లు అత్యాచారం చేశాడని, బంకర్ లైంగిక దాడి చేయడంతోపాటు శారీరకంగా, మానసికంగా వేధించాడని ఆమె తన ఎడమ అరచేతిపై రాసిన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. బంకర్ ఫల్తాన్‌లోని ఆమె అద్దె ఇంటి యజమాని కుమారుడని పోలీసులు చెప్పారు.

సతారా జిల్లా హోటల్ గదిలో గురువారం రాత్రి ఆమె ఉరి వేసుకుని మరణించారని ఉన్నతాధికారులు తెలిపారు. బీడ్ జిల్లాకు చెందిన బాధిత వైద్యురాలు ఫల్తాన్ తహసీల్ ప్రభుత్వాస్పత్రిలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత ఐదు నెలలుగా సతారా సబ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ బదానే తనపై పలుమార్లు అత్యాచారం చేసి లైంగికంగా వేధించాడని ఆమె ఆ నోట్‌లో పేర్కొన్నారు. మరో పోలీసు అధికారి ప్రశాంత్ బంకర్ తనను మానసికంగా వేధించాడని తెలిపారు.



డాక్టర్ చేతిపై సూసైడ్ నోట్, ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారి

ఎస్‌డిపిఒకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం : కుటుంబ సభ్యుల ఆవేదన

డాక్టర్‌పై పోలీసుల, రాజకీయపరమైన ఒత్తిళ్లు గత కొన్ని నెలలుగా ఉన్నాయని ఆమె కుటుంబ సభ్యులు చెప్పారు. పోలీసులు అరెస్టు చేసిన కొందరు వ్యక్తులకు ఆమె మెడికల్లీ ఫిట్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడమే వేధింపులకు కారణమన్నారు. ఈ విషయమై స్థానిక సబ్ డివిజనల్ పోలీసు అధికారి (ఎస్‌డిపిఒ)కు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఐదు నెలల క్రితం రాసిన ఆ లేఖలో ఎస్ఐ గోపాల్ బద్నెతోపాటు పాటిల్, లద్‌పుత్రే పేర్లను కూడా ఆమె లేఖలో పేర్కొన్నారు.

తన కేసును తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని ఆమె ఆ లేఖలో కోరారని వివరించారు. అధికారుల స్పందన కరువవడం, పోలీసుల వేధింపులు మరింత పెరగడంతో ఆమె బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపామని ఉన్నతాధికారులు చెప్పారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర హోం శాఖను కూడా నిర్వహిస్తున్న ఫడ్నవీస్ విషయం తెలిసిన వెంటనే సతారా ఎస్‌పితో మాట్లాడారు.

ఆ ఇద్దరు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైందని ప్రతిపక్షాలు విమర్శించాయి.

పారిశ్రామిక హబ్‌గా కేరళ!

- మరో ఆరేళ్లలో అభివృద్ధి చెందిన రాష్ట్ర హోదా
- పారిశ్రామికాభివృద్ధి విధాన పత్రాన్ని తీసుకువచ్చిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం

తిరువనంతపురం : కేరళ రాష్ట్రాన్ని దేశంలో ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా మార్చేందుకు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి విధాన పత్రాన్ని తీసుకువచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 200 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, 1700 ఎకరాల్లో విళింజం- కొల్లాం- పనలూర్ గ్రోత్ ట్రయాంగిల్, 358 ఎకరాల్లో కోచి గ్లోబల్ సిటీ ప్రాజెక్టు, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం నమూనాతో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ యూనివర్శిటీ, కొల్లామ్‌లో మెగా ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్ వంటి మెగా ప్రాజెక్టులపై ఈ డాక్యుమెంట్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది.

'విజన్ - 2031' పేరుతో జరిగిన పారిశ్రామిక అభివృద్ధి సెమినార్‌లో మంత్రి పి.రాజీవ్ ఈ విధాన పత్రాన్ని సమర్పించారు. 2031కల్లా కేరళను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది లక్ష్యంగా వుంది. 2031నాటికి కేరళ రాష్ట్రం ఏర్పడి 75ఏళ్లు పూర్తవుతుంది, అప్పటికల్లా భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలను రూపొందించుకోవడంలో భాగంగా ఈ విధాన పత్రాన్ని సెమినార్‌లో ప్రవేశపెట్టారు. విళింజమ్ పోర్టు ప్రాంతాన్ని అంతర్జాతీయ ఆర్థిక కేంద్రంగా అభివృద్ధిపరచాలంటే విళింజమ్ అభివృద్ధి కారిడార్ సాకారం కావాల్సి వుంది. పోర్టు ఆధారంగా పారిశ్రామిక ఆర్థిక పర్యావరణ వ్యవస్థను అభివృద్ధిపరచడంలో భాగంగా విళింజమ్- కొల్లామ్- పనలూర్ గ్రోత్ ట్రయాంగిల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హైటెక్ సెంటర్లకు అంతర్జాతీయ కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చేందుకు 200 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఉద్దేశించబడ్డాయి.

రాష్ట్రంలోని యువతను భవిష్యత్తులో పారిశ్రామిక అవసరాలు తీర్చేవిధంగా రూపుదిద్దేందుకు గానూ ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) నమూనాలో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ యూనివర్శిటీని ఏర్పాటు చేయనున్నారు. కోచి - బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా 358 ఎకరాల్లో కోచి గ్లోబల్ సిటీ ప్రాజెక్టు అమలు చేయనున్నారు. దీనివల్ల 1.20 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు, పరోక్షంగా 3.6 లక్షల ఉద్యోగాలు రానున్నాయి.

తిరువనంతపురంలో విఎస్ఎస్‌సి, ఇస్రో సమీపాన ఏరో డిఫెన్స్, డ్రోన్ ఇండస్ట్రియల్ క్లస్టర్ నెలకొల్పనున్నారు. కొజికోడ్- మలప్పురం పారిశ్రామిక క్లస్టర్‌లో భాగంగా బయోటెక్ అండ్ లైఫ్ సైన్సెస్ కేంపస్, ఇఎస్‌డిఎం (ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్), పవర్ ఎలక్ట్రానిక్ కేంపస్ ఏర్పాటు చేస్తారు.

బహుళ రంగాల మెగా ప్రాజెక్టు ఎరెనా మలబార్‌లో క్రీడలు, పరిశ్రమలు, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలకు చెందిన ప్రాజెక్టులు వుంటాయి. కన్నూర్ - కాసర్‌గోడ్ పారిశ్రామిక కారిడార్‌లో ఫిన్‌టెక్, ఐటిఇఎస్ (ఐటి ఆధారిత సేవలు), ఎఐ, రోబొటిక్స్, జౌళి, మౌలిక ప్రాతిపదిక రంగాలు వుంటాయి. కొల్లామ్‌లో మెగా ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలప్పూజలో మెరైన్ పార్క్, తిరువనంతపురంలో 500 ఎకరాల్లో మెడికల్ బయోటెక్ హబ్, కొట్టాయంలో 2వేల ఎకరాల్లో చిన్న తరహా పారిశ్రామిక నగరం ఏర్పాటు వంటి ప్రాజెక్టులను చేపట్టాలని కేరళ ప్రభుత్వం భావిస్తోంది. త్రిస్సూర్‌లో రోబొటిక్స్ పార్క్, రత్నాలు, ఆభరణాల పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. వాయనాడ్ కాఫీ పార్క్, పాలక్కాడ్ గ్రాఫెన్ అరోరా పార్క్‌లను కూడా ఏర్పాటు చేయతలపెట్టారు. కోచి, తిరువనంతపురంలో 2031కల్లా గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రాజెక్టు అమలవుతుందని విధాన పత్రం పేర్కొంది.

వాణిజ్య ప్రకటనల రూపకర్త పీయూష్ పాండే ఇక లేరు

ముంబయి : ప్రముఖ వాణిజ్య ప్రకటనల రూపకర్త పీయూష్ పాండే (70) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పాండే నెల రోజులుగా కోమాలో ఉన్నట్లు సమాచారం. శుక్రవారం తెల్లవారుజామున ఆయన మరణించనట్లు ప్రముఖ ప్రకటనల సంస్థ ఓగిల్వీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. పాండే ఓగిల్వీ ఇండియాకు చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా విధులు నిర్వహించారు. ఫెవికాల్, క్యాడ్‌బరీ డెయిరీ మిల్క్, ఓగిల్వీ ఇండియా వంటి ప్రసిద్ధ బ్రాండ్‌లకు ప్రచార ప్రకటనలను రూపొందించారు.

కరేబియన్ సముద్ర జలాల్లో బోటుపై అమెరికా దాడి

- ఆరుగురు మృతి

వాషింగ్టన్ : కరేబియన్ సముద్ర జలాల్లో ప్రయాణిస్తున్న బోటుపై అమెరికా దాడి చేసిందని, ఈ దాడిలో ఆరుగురు మరణించారని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ శుక్రవారం తెలిపారు. ఈ ప్రాంతంలో సెప్టెంబరు మాసంలో ట్రంప్ ప్రారంభించిన మాదకద్రవ్యాల నిరోధక ప్రచారంలో భాగంగా ఈ దాడులు జరిగినట్లు ఆయన చెప్పారు. మాదకద్రవ్యాలను ఆ బోటు తీసుకెళుతోందని, మరణించిన ఆ ఆరుగురు నార్కో టెర్రరిస్టులని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆ బోటులో ఏం తీసుకెళుతున్నారనడానికి ఎలాంటి సాక్ష్యాధారాలను హెగ్‌సెత్ చూపలేదు. సముద్ర జలాల్లో వున్న బోటుపై ఒక క్షిపణితో దాడి చేయడం వెంటనే అది పేలిపోవడం కనిపిస్తోన్న 20 సెకన్ల వీడియోను ఆయన పోస్టు చేశారు.



కొచ్చిలోని సెయింట్ థెరిసా కళాశాల శతాబ్ది ఉత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.

స్పష్టత, ధైర్యంతో ముందుకు...

- మహిళలకు రాష్ట్రపతి ముర్ము పిలుపు

తిరువనంతపురం : స్పష్టత, ధైర్యంతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మహిళలకు పిలుపునిచ్చారు. కేరళ రాజ్‌భవన్‌లో మాజీ రాష్ట్రపతి కెఆర్ నారాయణన్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. కొచ్చిలోని సెయింట్ థెరిసా కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో శుక్రవారం ఆమె పాల్గొని, శతాబ్ది ఉత్సవాల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ అభిరుచి, సామర్థ్యాలను వ్యక్తీకరించేందుకు అనువైన రంగాలను ఎంచుకోవాలన్నారు. దేశంలోనే కేరళ రాష్ట్రం అత్యంత ఆదర్శవంతమైన లింగ నిష్పత్తిని సాధించిందని, ఇతర రాష్ట్రాలు కూడా ఈ మార్గాన్ని అనుసరించాలని సూచించారు. గత దశాబ్దకాలంలో లింగ ఆధారిత బడ్జెట్ కేటాయింపులు నాలుగున్నర రెట్లు పెరిగాయని అన్నారు. 2011 - 2024 మధ్య మహిళల నేతృత్వంలో ఎంఎస్‌ఎంఇలు దాదాపు రెట్టింపయ్యాయని చెప్పారు. మహిళా నేతల నేతృత్వంలో సమాజం మరింత సమర్థవంతంగా పనిచేస్తూనే, మరింత మానవీయంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో 15 మంది మహిళలు భాగస్వాములయ్యారని, వారిలో ముగ్గురు కేరళీయులని చెప్పారు. అమ్ము స్వామినాథన్, అన్నీ మస్కరీన్, దాక్షాయణి వేలాయుధన్ ప్రాథమిక హక్కులు, సామాజిక న్యాయం, లింగ సమానత్వంతో పాటు అనేక ఇతర ముఖ్యమైన అంశాలపై చర్చలను ప్రభావితం చేశారన్నారు. కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, కేంద్ర మంత్రి సురేష్ గోపి, రాష్ట్ర మంత్రులు పి.రాజీవ్, వి.ఎన్.వాసవన్, ఎంపి హిబిఈడెన్, ఎమ్మెల్యే టి.జె.వినోద్, కాలేజీ ప్రిన్సిపల్ అనుజోసెఫ్ పాల్గొన్నారు.

పెరుగుతున్న అసమానతలు

(మొదటిపేజీ తరువాయి)

కల్పించాలన్నారు. పలువురు అడిగిన ప్రశ్నలకు ప్రభాత్ సమాధానాలిస్తూ దేశంలో మోడీ విధానాలు ఏకపక్షంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తన ప్రసంగానికిముందు సిపిఎం పూర్వ కార్యదర్శి సీతారాం ఏచూరిపై ప్రచురించిన పుస్తకాన్ని ప్రభాత్ పట్నాయక్ ఆవిష్కరించారు. ప్రభాత్ పట్నాయక్ రాసిన బియాండ్ లిబరలిజం పుస్తకాన్ని అంజయ్య సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో తొలుత వక్తలను ప్రొగ్రెసివ్ ఫోరం నాయకులు బుడ్డిగ జమిందార్ వేదిక మీదకు ఆహ్వానించారు. సోషల్ సైన్సెస్ ట్రస్ట్ నిర్వాహకులు అంజయ్య సభకు అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ అంజిరెడ్డి, ఎంబివికె కన్వీనర్ పి.మురళీకృష్ణ, మంచి పుస్తకం నిర్వాహకులు కాపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృత్యు శకటాలు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. దీనిని కోర్టు కొట్టి వేసినప్పటికీ, ఆదిశలో వున్న అవకాశాలను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సమాచారం. బస్సు బాడీని నిర్మించే సమయంలో 36 సీట్లుగా ఉన్న సామర్థ్యాన్ని నిబంధనలకు వ్యతిరేకంగా 40కి పైగా ప్రైవేటు ఆపరేటర్లు మారుస్తున్నారు. సీట్ల మధ్య స్థలాన్ని తగ్గించడం, నడవడానికి అతితక్కువ స్థలాన్ని కేటాయించడం వంటి పనులు చేస్తున్నారు. తనిఖీలతో దీనిని నివారించే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక భద్రతా ప్రమాణాల పరిస్థితి మరీ ఘోరం!సుదూర ప్రయాణం చేసే బస్సులలో డ్రైవర్లకు తగినంత రెస్టు ఇవ్వడం లేదు. ప్రయాణికులను నిర్ధేశించిన సమయానికే లక్ష్యానికి చేర్చాలన్న టార్గెట్ కూడా వారిపై ఒత్తిడిని పెంచుతోంది. బస్సులో ఏదైనా ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు తప్పనిసరిగా అత్యవసర ద్వారం ఏర్పాటు చేయడంతో పాటు అగ్ని మాపక సామాగ్రిని కూడా బస్సుల్లో ఉంచాలి. వీటిని అసలు పట్టించుకోవడం లేదు. తాజా ప్రమాదంలోనూ ఇదే స్థితి కనిపిస్తోంది. ఫలితంగా ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది.

ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలు

- ఈ ఏడాది మార్చి 6న హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న రమణ ట్రావెల్స్ బస్సు ఏలూరు జిల్లా చోడిమెల్ల సమీపంలో ట్రక్‌ను ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందారు. 20 మందికి పైగా గాయపడ్డారు. బస్సు అధిక వేగమే ఈ ప్రమాదానికి కారణమని తేలింది.
- ఈ ఏడాది జనవరి 18న ఒడిసా నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్రయివేటు బస్సు విజయనగరం జిల్లా మధుపాడ సమీపంలో ట్రక్కును ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. 15 మంది గాయపడ్డారు.
- 2013 అక్టోబర్ 30న బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్ బస్సు మహబూబ్‌నగర్ జిల్లా పాలెం వద్ద దగ్ధం కావడంతో 45 మంది సజీవ దహనం అయ్యారు.
- 2009 జులై 12న శివసాయి ట్రావెల్స్‌కు చెందిన ఓ ప్రయివేటు బస్సు ఆళగడ్డ సమీపంలో నిలిచి ఉన్న ఐరన్ ఓర్ లారీ పక్క నుంచి పోవడంతో 11 మంది మృతి చెందారు.

యుఎఇ, ఎపిల మధ్య సరికొత్త వాణిజ్య బంధం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న దీర్ఘకాలిక స్నేహ బంధాన్ని ప్రస్తావిస్తూ, రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, పెట్రో కెమికల్స్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో భాగస్వామ్యంతో పాటు, ముఖ్యంగా అమరావతిలో పెట్టుబడులు పెట్టే అంశంపై థానీ ఆసక్తి చూపించారు. ఎపిలో పెట్టుబడి అవకాశాలను పరిశీలించేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. త్వరలోనే రాష్ట్రాన్ని సందర్శించనున్నట్లు చెప్పారు.

పెట్టుబడులకు ఆహ్వానం

దుబాయి వర్చువల్ అసెట్ రెగ్యులేటరీ అథారిటీ (విఎఆర్ఎ) మేనేజింగ్ డైరెక్టర్ దీపా రాజా కార్బన్‌తో సిఎం చంద్రబాబు సమావేశమై చర్చలు జరిపారు. డిజిటల్ ఎకానమీ, పిన్ టెక్, బ్లాక్ చైన్, వర్చువల్ అసెట్ రెగ్యులేషన్, క్రిప్టో డిజిటల్ ట్రాన్సాక్షన్ సెక్యూరిటీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ - దుబాయ్ మధ్య భాగస్వామ్య అవకాశాలను సిఎం విశ్లేషించారు. ఎపి ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌లో ముందంజలో ఉందని, ఫిన్‌టెక్, వ్యాలీ, విశాఖపట్నం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి ప్రాజెక్టులు డిజిటల్ ఇన్నోవేషన్‌కు కేంద్రాలుగా ఎదుగుతున్నాయని వివరించారు. వర్చువల్ అసెట్ రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్, డిజిటల్ కరెన్సీ సేఫ్టీ నార్మ్స్, బ్లాక్ చైన్ ఆధారిత ప్రభుత్వ సేవల అమలు కోసం సంయుక్తంగా పని చేయాలని సిఎం ప్రతిపాదించారు. దీనికి రాజా సుముఖత వ్యక్తం చేశారు. అదే విధంగా క్రౌన్ ఎల్ఎన్‌జి సిఇఒ స్వపన్ కటారియాతో, ట్రైస్టార్ గ్రూప్ సిఇఒ యూజిన్ మెయిన్, ఆస్టర్ గ్రూప్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆజాద్ మూపెన్‌లతో ఈ సందర్భంగా సిఎం భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం పిపిపి పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, మెడికల్ కళాశాలలు, వైద్య సాంకేతికత ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు.

బంగాళాఖాతంలో నేడు వాయుగుండం

(మొదటిపేజీ తరువాయి)

సంప్రదించాలన్నారు. తీరం వెంబడి గంటకు 50-70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని ప్రఖర్‌జైన్ తెలిపారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ నెల 25న కోనసీమ, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. 26న గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, పల్నాడు, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 27న కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

అమలాపురంలో 63 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం అధిక వర్షపాతాలు నమోదయ్యాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో 63 మిల్లీమీటర్లు, ఏలూరు జిల్లా తుదువైలో 59, అల్లూరి జిల్లా బుట్టాయగూడెంలో 55, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో 55, నంద్యాల జిల్లా రంగాపురంలో 48, వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్‌లో 44.7 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతాలు నమోదయ్యాయి.

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు ముసురును తలపిస్తున్నాయి. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకుతోడు మరో వారంరోజులపాటు ఇలాంటి వాతావరణమే ఉంటుందని రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అకాల వర్షాలతో పాటు అనారోగ్య సమస్యలనూ మోసుకొస్తుంది. మరి ఇంట్లోని పెద్దల, పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏం చేయాలి? చిన్న చిన్న జాగ్రత్తలతో, చిట్కాలతో మనం ఏవిధంగా సన్నద్ధం కావాలి? అనేది తెలుసుకుందాం...!



ధన్య చరిత



కొమ్మల్లో కోయిల కమ్మగా కూసేను
గుమ్మంలో గులాబీ గమ్మత్తుగా పూసేను
రెమ్మల్లో రామ చిలుక సరిగమలే పలికేను
కమ్మని చెలి ఊసులే మధురిమలే చిలికేను

చెరువుల్లో చేప పిల్ల సరదాగా ఈదేను
తరువుల్లో తెమ్మెర సితారనే మీటేను
మెరుపుల్లో మేనకే మైమరచి ఆడేను
కురులల్లో కుసుమాలే కనువిందు చేసేను

నింగిలోన గాలిపటం రివు రివ్వున ఎగిరేను
పొంగి పోయి పాలగిన్నె పక పకా నవ్వేను
తొంగి చూసి నెలవంక కలువ చెంత చేరేను
వంగిపోయి తరువులు విధేయతనే చాటేను

దప్పిక తీర్చి నదులన్నీ సాగరుని చేరేను
సాయపడే గుణము చాలా ప్రకృతిలో ఉండెను
ఊపిరి ఉన్నంత వరకు పరుల సేవ చేయాలి
ఊపిరాగి పోయాక చరితై నువ్వు మిగలాలి!

- గుండాల నరేంద్ర బాబు, తిరుపతి,
94932 35992.

నేను గీసిన బొమ్మ





- సిరికొండ దీక్షిత,
5వ తరగతి,
తల్లంపాడు ప్రాథమిక పాఠశాల,
ఖమ్మం, తెలంగాణ.





- దూపల్లి శివనందిని,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ముసురుతో జాగ్రత్త సుమా...!

అకాల వర్షాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. అసలే కొద్ది కొద్దిగా చలివాతావరణ పరిస్థితులు మొదలయ్యాయి. ఇలాంటి సమయంలో కురుస్తున్న వర్షాలు అనేక రోగాలు చుట్టుముట్టి బాధిస్తుంటాయి. వర్షాలు పడటంతో దోమలు, ఈగలు వంటి కీటకాల బెడద పెరుగుతుంది. ఇవి వైరల్ ఫీవర్లు, ఇన్‌ఫెక్షన్లు కల్గిస్తాయి. తరచూ జలుబు, దగ్గు వంటివి రావడంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. అసిడిటీ, ఉబ్బరం, అజీర్ణం, గ్యాస్ట్రో ఎంటెరిటిస్, అల్సర్, గ్యాస్ట్రో ఎసోఫాగియల్ రిఫ్లక్స్ డిసీజ్ వంటి గ్యాస్ట్రిక్ సమస్యలు సర్వసాధారణంగా వస్తుంటాయి.

తల తడవకుండా చూసుకోవాలి : వర్షానికి తడిస్తే తొలుత ప్రభావం పడేది చర్మంతోపాటు వెంట్రుకల మీదే. తల తడిగా ఉన్నప్పుడు చుండ్రు అధికమవుతుంది. పేలూ పడతాయి. తలో చుండ్రు రావడం.. ఆ తర్వాత మొహంపై మొటిమలు రావడం జరుగుతుంది. ఇతర ఇన్ఫెక్షన్లు బాధించే అవకాశం కూడా ఉంది. అందుకే తల తడవకుండా గొడుగు లాంటివి ఉపయోగించాలి. తడిసి ఇంటికి వచ్చిన వెంటనే తలస్నానం చేయాలి.

కలుషిత, కల్తీ ఆహారం తీసుకోవద్దు : వర్షాకాలంలో ఉండే అధిక తేమ జీర్ణశక్తిని తగ్గిస్తుంది. బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు, విష పదార్థాల వల్ల ఆహారం, నీరు కలుషితమవటంతో వివిధ అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే అవకాశం ఉంది. ఈ అనారోగ్య పరిస్థితులను వర్షాకాలంలో తప్పించుకోవటం



అనివార్యమే. వైరస్ వ్యాప్తికి దోహదపడే కలుషిత ఆహారం, చల్లని పదార్థాలను తీసుకోవద్దు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత : వర్షాలు కురిసే సమయంలో శారీరకంగా, వ్యక్తిగతంగా జాగ్రత్తలు తీసుకోవడమే కాదు. ఇంటి పరిసరాల గురించి కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉండగలుగుతారు. ముఖ్యంగా కాలమేదైనా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడటంతో ఇంట్లో కొన్ని వస్తువులు తేమగా ఉంటాయి. ఎక్కువ తడి, తేమ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

దోమలు, ఈగలు నుంచి రక్షణ : వానాకాలంలో దోమలు, ఈగలు పెరుగుతాయి. కొన్ని రకాల జ్వరాలు, అంటువ్యాధుల వ్యాప్తికి అవే కారణం. మనం పరిసరాల్లో నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇంట్లోగానీ ఇంటి పరిసరాల్లోగానీ దోమలు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఫంగల్ ఇన్ఫెక్షన్లు : వర్షంలో తడిస్తే ఇంటికి రాగానే పాదాలను శుభ్రంగా కడుక్కోవాలి. ఆ తరువాత తడిలేకుండా తుడుచుకోవాలి. వర్షాకాలంలో ఎక్కువగా తడవడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్ సోకే అవకాశం ఉంది. అంటువ్యాధులు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇంటికి రాగానే కాళ్ళను గోరు వెచ్చని నీటితో కడుక్కోవాలి.

కాచి చల్లార్చిన నీరే మేలు : ఎక్కువసార్లు బాగా కాచి వడపోసిన నీటిని తాగుతూ ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ మంచి నీటిని నేరుగా తాగటం మంచిది కాదు. జ్వరం వచ్చి రెండు రోజుల వరకు తగ్గకుండా ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి. వేడి పదార్థాలను తీసుకోవాలి. వర్షాకాలంలో కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్స్ తీసుకోకూడదు.

ఆరోగ్యంగా ఉండాలంటే : అధిక వర్షాల వల్ల ఫంగస్, బ్యాక్టీరియా, వైరస్‌లు వంటివి గాల్లో వ్యాపిస్తుంటాయి. అందువల్ల వర్షాల్లో తడిచే వారు అనారోగ్యం పాలవుతుంటారు. కొన్ని జాగ్రత్తలు పాటించటం ద్వారా వ్యాధులు రాకుండా ఉండొచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

- సమతుల ఆహారం తీసుకోవటం.
- రోజూ వ్యాయామం చేయటం
- జంక్, స్పైసీ, జిడ్డు గల ఆహారాన్ని తక్కువగా తీసుకోవాలి
- పెరుగు లేదా మజ్జిగ వంటి ప్రోబయోటిక్స్ కలిగిన పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.
- అవి మన జీర్ణ వ్యవస్థకు మద్దతు ఇచ్చే బ్యాక్టీరియాను కల్గివుంటాయి.
- పచ్చి ఆకుకూరల్లో సూక్ష్మక్రిములు లేకుండా చూసుకోవాలి.
- ప్రేగులకు అనుకూలమైన, తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఎంచుకోవాలి.
- ముడి కూరగాయలకు బదులుగా ఆవిరి లేదా ఉడికించిన కూరగాయలను తినాలి.
- తద్వారా బ్యాక్టీరియా, వైరస్‌లను దరిచేరకుండా చూసుకోవచ్చు.
- కాచి చల్లార్చిన నీటినే తాగాలి.

పిల్లల ఆరోగ్యమూ కీలకమే!




సాధారణంగా వర్షాకాలం, శీతాకాలాల్లో చిన్నారులకు తరచూ జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. వర్షంలో తడవడం వల్ల తరచూ జలుబు, దగ్గు, జ్వరం లాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి. చలి వాతావరణం ఉన్న సమయాల్లో చిన్నారులకు వేడి నీటితోనే స్నానం చేయించాలి.

- తలంటు స్నానం చేయించేటప్పుడు వేడి నీటిలో కొన్ని చుక్కల నువ్వుల నూనె వేయాలి. దీనివల్ల పిల్లల్లో శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి.
- కొంచెం పసుపు, ఉప్పు కలిపిన మిశ్రమాన్ని చిన్నారులతో తినిపించాలి. తర్వాత గోరు వెచ్చని నీరు తాగించాలి. ఇలా చేస్తే జలుబు, దగ్గు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది.
- గొంతు నొప్పి, దగ్గు సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు ఉప్పు, వాము, పసుపు కలిపి వేడి చేసి చిన్న గుడ్డలో కట్టుకోవాలి. దాంతో గొంతుపై నెమ్మదిగా కాపడం పెట్టాలి. ఇలా చేస్తే త్వరగా ఉపశమనం లభిస్తుంది.
- పసుపు కొమ్ములు, గోధమలను సమాన మొత్తంలో తీసుకుని వాటిని నూనె లేకుండా దోరగా వేయించాలి. తర్వాత మెత్తని పొడిగా తయారు చేసుకోవాలి. ఈ పొడిని కొంత మొత్తంలో ఉదయం, సాయంత్రం పిల్లలకు ఇవ్వాలి. ఇలా చేస్తే శ్వాసకోశ సమస్యలు, దగ్గు తగ్గుతాయి.
- వాము ఒక టీస్పూన్, బెల్లం 4 టీస్పూన్లు తీసుకుని వాటిని మెత్తగా నూరుకోవాలి. ఈ కషాయాన్ని పిల్లలతో తాగించాలి. ఇలా చేయడం వల్ల జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటివి తగ్గుతాయి.
- ఇన్ఫెక్షన్‌తో ఇబ్బంది పడుతున్న చిన్నారులకు పసుపు, పటికబెల్లం పొడిని బొగ్గు నిప్పుపై వేసి చిన్నారులతో పట్టించాలి. ఇలా చేయడం వల్ల గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.
- గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం, తేనె కలిపి పిల్లలతో తాగించాలి. ఇలా రోజుకు రెండు సార్లు తాగిస్తే మంచి ప్రయోజనం ఉంటుంది.
- వారానికి కనీసం మూడు నాలుగు సార్లు ఆకుకూరలు తింటే ఎంతో మంచిది.
- ఉడకబెట్టిన సెనగలు, వేరుసెనగలు, అల్సందలు మొదలైన వాటిని వారానికి రెండు మూడుసార్లు స్నాక్‌లా తింటే మంచిది.
- వారానికి నాలుగసార్లు తెల్ల నువ్వుల ఉండలు, పల్లీ ఉండలు, సున్నుండలు తింటే వంటికి ఎంతోబలం.
- సీజనల్‌గా దొరికే పండ్లను వారానికి రెండు మూడుసార్లు తింటే ఆరోగ్యం బాగా మెరుగుపడుతుంది.
- నానబెట్టిన బాదంపప్పును స్నాక్‌లాగా తినొచ్చు.
- జీడిపప్పు, పిస్తాపప్పు వంటివి కూడా మంచిదే. కానీ పరిమితంగా మాత్రమే తినాలి.
- ఉసిరికాయ, తానికాయ, కరక్కాయలను త్రిఫలాలతో త్రిఫల చూర్ణం తయారు చేస్తారు. వీటిలో విటమిన్-సి, ఫైటో కెమికల్స్, ఫైటో న్యూట్రియంట్స్, పాలీఫినాల్స్, అసెన్షియల్ ఆయిల్స్ ఉంటాయి. పోషకాల కంటే ఇందులో ఔషధ గుణాలే ఎక్కువ. ఈ చూర్ణాన్ని సమాన పరిణామంలో తీసుకుంటే ఉపయోగకరం.

'స్పిరిట్' ఆడియో గ్లింప్స్ విడుదల

ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం స్పిరిట్. అర్జున్‌రెడ్డి, కబీర్‌సింగ్, యానిమల్ చిత్రాల విజయంతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపును సందీప్‌రెడ్డి తెచ్చుకున్నారు. ప్రభాస్ పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం రాత్రి 11 గంటలకు 'సౌండ్ స్టోరీ ఆఫ్ ది ఫిలిం స్పిరిట్' అంటూ 1.31 నిమిషాల ఆడియో గ్లింప్స్ వదిలారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ గ్లింప్స్ విడుదల చేశారు. ఐపిఎస్ అధికారిగా ఈ సినిమాలో ప్రభాస్ నటిస్తున్నారు. 'వీడి గురించి విన్నాను.. యూనిఫామ్ ఉన్నా, లేకపోయినా ప్రవర్తనలో తేడా ఉండదని! ఖైదీ యూనిఫాంలో ఎలా ప్రవర్తిస్తాడో చూద్దాం.!' అంటూ ప్రభాస్ గురించి నటుడు ప్రకాష్‌రాజ్ వ్యాఖ్యానిస్తారు. 'మిస్టర్ సూపరింటెండెంట్ నాకు చిన్నప్పటినుంచి ఒక చెడ్డ అలవాటుంది' అంటూ ప్రభాస్ డైలాగ్ సగం చెప్పడంతోనే గ్లింప్స్ వీడియో



పూర్తయింది. ప్రభాస్‌ను ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్‌స్టార్‌గా అభివర్ణిస్తూ టైటిల్ కార్డు కూడా వేశారు. త్రిప్తి డిమ్రి కథానాయిక. వివేక్ ఒబెరాయ్, కాంచన, ప్రకాష్‌రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హర్షవర్ధన్ రాణె సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

శర్వానంద్ హీరోగా శ్రీనువైట్ల సినిమా



దర్శకుడు శ్రీను వైట్ల మరో కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఆయన దర్శకత్వం వహించిన చివరి చిత్రం 'విశ్వం' (2024) బాక్సాఫీస్ వద్ద పరాభవాన్ని చవిచూసింది. ఆయన కాస్త సమయం తీసుకొని.. ఇప్పుడు మరో కొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇందులో శర్వానంద్ కథానాయకుడిగా నటించబోతున్నారు. కుటుంబ కథాచిత్రంగా ఉండటంతో కథ విన్న వెంటనే శర్వానంద్ అంగీకరించారని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారు. ప్రస్తుతం 'భోగి', 'బైకర్' సినిమాల చిత్రీకరణలతో శర్వానంద్ బిజీగా ఉన్నారు. ఆయనే నటించిన కంప్లీట్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా 'నారి నారి నడుమ మురారి' సంక్రాంతి రిలీజ్‌కు ముస్తాబవుతోంది

హీరోగా లోకేష్ కనగరాజ్



సౌత్ ఇండస్ట్రీలో సూపర్ హిట్ చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనకరాజ్ కథానాయకుడిగా మారబోతున్నారు. 'కెప్టెన్ మిల్లర్ 2' చిత్రంలో ఆయన హీరోగా నటించబోతున్నట్లు సమాచారం. అరుణ్ మాదేశ్వరన్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు ఇటీవలె నిర్వహించారు. 'కెప్టెన్ మిల్లర్' చిత్రం గతంలో ధనుష్ హీరోగా విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఇప్పుడు ఈ సీక్వెల్‌లో లోకేష్ కనకరాజ్ హీరోగా కనిపించబోతున్నారు. ఈ పాత్ర కోసం లోకేష్ ప్రత్యేక శిక్షణ తీసుకున్నారని, ఫైట్స్, ఆత్మరక్షణ విద్యల్లో నైపుణ్యం సాధించారని సమాచారం.

టీమిండియాకు నాల్గో స్థానమే

- నేడు ఆస్ట్రేలియా × దక్షిణాఫ్రికా జట్ల మధ్య కీలక పోరు
- గెలిచిన జట్టుతో సెమీస్‌లో తలపడనున్న హర్మన్‌ప్రీత్ సేన

ఐసిసి మహిళల ప్రపంచకప్‌లో టీమిండియా సెమీస్ ప్రత్యర్థి ఎవరో నేటితో తేలిపోనుంది. ఇండోర్ వేదికగా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల మధ్య శనివారం జరిగే మ్యాచ్ విజేతతో టీమిండియా సెమీస్‌లో తలపడనుంది. సెమీస్ బెర్త్‌లు ఇప్పటికే ఖరారైనా.. సెమీస్‌లో తలపడే జట్లపై ఇంకా ఉత్కంఠ వీడలేదు. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నాల్గో స్థానంలో ఉన్న జట్టుతో రెండో సెమీస్‌లో తలపడనుంది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, ఇండియా జట్లు సెమీస్‌కు చేరగా.. న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. కానీ సెమీస్‌లో భారత్‌తో తలపడే జట్టుపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. గురువారం జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో భారత మహిళలజట్టు న్యూజిలాండ్‌ను 53పరుగుల తేడాతో ఓడించి 6పాయింట్లతో 4వ స్థానంలో నిలిచి సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. 26న జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన బంగ్లాదేశ్‌పై గెలిచినా.. ఇదే స్థానంలో నిలవనుంది. మరోవైపు చివరి లీగ్ మ్యాచ్‌లో టాప్-3 జట్లపై ఉత్కంఠ నెలకొంది. 26న జరిగే రెండు మ్యాచ్‌లతో 2025 ఐసిసి మహిళల ప్రపంచకప్ లీగ్ మ్యాచ్‌లు ముగియనున్నాయి. 29న గౌహతి వేదికగా తొలి సెమీస్, 30న నవీ ముంబయిలో రెండో సెమీస్, నవంబర్ 2న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.



టాప్ బెర్త్‌పై దక్షిణాఫ్రికా, ఆసీస్ చూపు..

వన్డే ప్రపంచకప్‌లో టాప్ బెర్త్‌పై దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా కన్నేసాయి. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా 6మ్యాచ్‌లు ముగిసేసరికి 11పాయింట్లతో ఇప్పటికి అగ్రస్థానంలో నిలువగా.. దక్షిణాఫ్రికా జట్టు కూడా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 10పాయింట్లతో 2వ స్థానంలో ఉంది. ఈ రెండు జట్ల మధ్య శనివారం కీలక పోరు జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు అగ్రస్థానంలో నిలవనుంది. దక్షిణాఫ్రికా జట్టు ఆస్ట్రేలియాను ఓడిస్తే.. 12పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంటుంది. ఆసీస్ 11పాయింట్లతో రెండోస్థానానికే పరిమితమౌతుంది. ఒకవేళ ఈ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయితే ఆస్ట్రేలియా 12పాయింట్లతో అగ్రస్థానంలో నిలవనుంది. టాప్‌లో నిలిచిన జట్టు 4వ స్థానంలో ఉన్న భారత్‌తో రెండో సెమీస్‌లో తలపడాల్సి ఉంటుంది. ఏ జట్టు టాప్ బెర్త్ దక్కించుకుంటుందో.. తొలి సెమీస్‌లో ఏఏ జట్లు తలపడనున్నాయో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల మధ్య నేడు జరిగే మ్యాచ్‌లో తేలిపోనుంది.

శ్రీలంక, పాకిస్తాన్ మ్యాచ్ వర్షార్పణం

శ్రీలంక వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లకు వర్షం అడ్డంకిగా నిలుస్తోంది. ఆతిథ్య జట్టుకు స్వదేశంలో గెలిచే అవకాశం ఉన్న మ్యాచ్‌లకు వర్షం అడ్డు తగులుతూనే ఉంది. ప్రేమదాస స్టేడియంలో ఇప్పటికే మూడు మ్యాచ్‌లు రద్దు కాగా.. శ్రీలంక, పాకిస్తాన్ జట్ల మధ్య శుక్రవారం జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు భారీ వర్షం కురవడంతో మ్యాచ్‌ను 37 ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచిన శ్రీలంక కెప్టెన్ ఆటపట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు 4.2ఓవర్లలో 18పరుగులు చేసిన అనంతరం మళ్లీ భారీ వర్షం కురవడంతో మ్యాచ్ నిలిచింది. ప్రస్తుతం నాలుగు పాయింట్లతో ఉన్న ఆతిథ్య శ్రీలంక జట్టు గెలుపుతో గ్రాండ్‌గా నిష్క్రమించాలని చూసినా.. వర్షం అడ్డంకిగా నిలిచింది.

- స్పోర్ట్స్ డెస్క్

పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	ఓ	రద్దు	పా	నె.ర.
1. ఆస్ట్రేలియా	6	5	0	1	11	+1.70
2. దక్షిణాఫ్రికా	6	5	1	0	10	+0.27
3. ఇంగ్లండ్	6	4	1	1	9	+1.02
4. ఇండియా	6	3	3	0	6	+0.62
5. శ్రీలంక	7	1	3	3	5	-1.03
6. న్యూజిలాండ్	6	1	3	2	4	-0.49
7. పాకిస్తాన్	7	0	3	3	3	-2.65
8. బంగ్లాదేశ్	6	1	5	0	2	-0.57

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

గెలుపుతో ముగించాలి

- నేడు ఆస్ట్రేలియాతో మూడో వన్డే
- ఉదయం 9.00గం॥లకు



సిడ్నీ: వన్డే సిరీస్‌ను చేజార్చుకున్న టీమిండియా.. ఇక మూడో, చివరి వన్డేలో గెలిచి టి20 సిరీస్‌కు సిద్ధం కావాలని చూస్తోంది. ఈ క్రమంలో సిడ్నీ వేదికగా శనివారం జరిగే మూడో వన్డేలో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి వన్డేలో చిత్తుగా ఓడిన భారతజట్టు.. అడిలైడ్ వేదికగా జరిగిన రెండో వన్డేలో ఆసీస్‌కు ముచ్చెమటలు పట్టించింది. కోహ్లి విఫలమైనా.. రోహిత్ శర్మ ఫామ్‌లోకి వచ్చి అర్ధసెంచరీతో రాణించాడు. శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, సుందర్ రాణించినా.. కెఎల్ రాహుల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్‌లో నిరాశపరిచారు. ఇక చివరి వన్డే జరిగే సిడ్నీ మైదానం బౌలర్లకు స్వర్గధామం. తొలి 15ఓవర్లు క్రీజ్‌లో నిలదొక్కుకుంటే ఆ తర్వాత పరుగులు రాబట్టడం సులువు. పెర్త్‌లో జరిగిన తొలి వన్డేలో ఆడిన మాథ్యూ కుహ్నెమాన్.. రెండో వన్డేకు దూరమయ్యాడు. జంపా జట్టులోకి రావడంతో అతన్ని తప్పించారు. అయితే సిడ్నీలో జరిగే మూడో వన్డేకు మళ్లీ అతడు తుది జట్టులోకి వచ్చాడు. అదనపు వికెట్ కీపర్‌గా జోష్ ఫిలిప్‌ను ఎంపిక చేశారు. దీంతో అతనికి మూడో వన్డే కోసం పిలుపు ఇచ్చారు.

ఎడ్వర్డ్స్‌కు పిలుపు

మూడో వన్డే కోసం ఆస్ట్రేలియా మార్పులు చేసింది. న్యూ సౌత్‌వేల్స్ ఆల్‌రౌండర్ అయిన జాక్ ఎడ్వర్డ్స్.. హేజిల్‌వుడ్ స్థానంలో జట్టులోకి రానున్నాడు. వన్డే బృందం నుంచి మార్నస్ లబుషేన్‌ను కూడా తప్పిస్తున్నట్లు తాజాగా పేర్కొంది. మరోవైపు టి20 సిరీస్ కోసం గ్లెన్ మ్యాక్స్‌వెల్, బెన్ డ్వార్షియస్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) పిలుపునిచ్చింది. రెండు టి20లకు మాత్రమే హేజిల్‌వుడ్ ఎంపిక కాగా.. 20ఏళ్ల బౌలర్ బియర్డ్‌మ్యాన్‌ను చివరి మూడు టి20 మ్యాచ్‌లకు ఎంపికయ్యాడు. ఇండియా-ఎతో జరిగిన సిరీస్‌లో ఎడ్వర్డ్స్ రాణించడంతో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు.

జట్లు(అంచనా)...

భారత్ : రోహిత్ శర్మ/యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, సుందర్/కుల్‌దీప్, నితీశ్ కుమార్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్.

ఆస్ట్రేలియా : మార్ష్(కెప్టెన్), హెడ్, షార్ట్, ఫిలిప్పే(వికెట్ కీపర్), రెన్‌షా, కాన్వే, ఓవెన్, స్టార్క్, ఎల్లిస్, కెహ్నెమన్, హేజిల్‌వుడ్/ఎడ్వర్డ్స్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68